# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - బుధవారం 26 మార్చి 2025 | సంపుటి:9 | సంచిక:90 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


## ప్రసాదాలపై జీఎస్టీ ఎత్తివేత



2

## తీహార్ జైలు తరలింపు



కిక్కిరిసిపోతున్న చెరసాల

2

## సుపథం దర్శనంపై టీటీడీ ఎస్.డబ్ల్యూ.ఎఫ్ హర్షం


### ప్రధాన సమస్యలు పరిష్కరించాలని టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయుడుకి నేతల వినతి



**తిరుమల, మనం న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానం లోని శాశ్వత ఉద్యోగులకు ప్రతి మూడు నెలలకు ఓ మారు సిఫార్సు లేఖల ద్వారా సుపథం దర్శనం కేటాయించాలన్న టీటీడీ బోర్డు నిర్ణయాన్ని తాము హర్షిస్తున్నామని టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్, (సీఐటీయూ ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. వెంకటరమణ, కాటా గుణశేఖర్, గౌరవాధ్యక్షులు జి. వెంకటేశంలు టీటీడీ చైర్మన్ కు ధన్యవాదాలు తెలియజేశారు. మంగళవారం నాటి సాయంత్రం తిరుమల లో టీటీడీ చైర్మన్ కార్యాలయంలో ఆయనను కలిసి

...మిగతా 2లో

## ఏప్రిల్ మొదటివారంలో మెగా డీఎస్సీ



**అమరావతి:** ఏపీలోని నిరుద్యోగులకు శుభవార్త. ఏప్రిల్ మొదటి వారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. పాఠశాలల ప్రారంభం నాటికి పోస్టింగ్లు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.

''గత ఐదేళ్లలో ఒక వ్యక్తి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. వైకాపా ప్రభుత్వ పాలనను ప్రజలు ఆమోదించలేదు. గత పాలనతో విసిగి మాకు విస్తృత మద్దతు ఇచ్చారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించే ప్రక్రియ చేపట్టాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రజలకు అందాలి. వచ్చే నెల మొదటి వారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం. జూన్లో పాఠశాలలు తెరిచేలోపు నియామకాలు పూర్తి కావాలి'' అని చంద్రబాబు అన్నారు.''మే నెలలో తల్లికి వందనం పథకం ప్రారంభిస్తాం. రూ.15 వేల చొప్పున.. ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఇస్తాం. పాఠశాలలు తెరిచేలోగా ఈ పథకం కింద ఆర్థిక సాయం అందిస్తాం. అయోమయంలో పడేసిన పోలవరం ప్రాజెక్టును గాడిన పెట్టాం. రాజధాని అమరావతి ప్రాజెక్టును 2027లోగా పూర్తి చేస్తాం. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ వంటి సంస్థల నుంచి ఆర్థిక సహకారం తీసుకుంటున్నాం. ల్యాండ్ మానిటైజేషన్ ద్వారా ఈ అప్పులు తీర్చేస్తాం'' ''స్వర్ణాంధ్ర 2047 విజన్కు 10 సూత్రాల ఆధారంగా పనిచేయాలి. రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ సచివాలయ పరిధి వరకు ప్రణాళికలు చేరాల్సిందే. జీఎస్డీపీ, జీవీఏలతో పాటు తలసరి ఆదాయం కూడా గణనీయంగా పెంచాలి. వచ్చే ఏడాదికి 15 శాతం ప్లస్ జీఎస్డీపీ సాధించేలా కలెక్టర్లు కృషి చేయాలి. వ్యవసాయం, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి'' అని కలెక్టర్లను సీఎం ఆదేశించారు.

## ప్రజలపై ఒక్క పైసా భారం లేకుండా రాజధాని నిర్మాణం

### మంత్రి నారాయణ



**అమరావతి:** రాజధాని అమరావతిలో మంత్రి నారాయణ పర్యటించారు. ఇప్పటికే పలు పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా.. నిర్మాణంలో ఉన్న కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల బంగ్లాలను, సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం మాట్లాడారు.

...మిగతా 2లో

## అదనంగా లక్ష ఎకరాల్లో కాఫీసాగు విస్తీర్ణం పెంచాలి

**అమరావతి:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమంపై సీఎం పలు సూచనలు చేశారు. సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలను ఆదుకోవాల్సి ఉందన్నారు. తమ ప్రభుత్వంలో బడుగుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పీ4లో భాగంగా సమాజంలో అట్టడుగున ఉన్న పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. డ్వాక్రా, మహిళా సంఘాల ద్వారా పేదలను గుర్తించి వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని

...మిగతా 2లో

## ఆ పరిస్థితి రానీయొద్దు.. సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

**అమరావతి:** ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం ఇవాళ(మంగళవారం) రాష్ట్ర సచివాలయంలో జరిగింది. వేసవి నీటి ఎద్దడిపై సీఎం చంద్రబాబు ఆయా జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. వేసవి పూర్తయ్యే వరకు జిల్లాల్లో కాల్సెంటర్లు పెట్టుకోవాలని.. తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీళ్ల సమస్యలపై జీపీఎస్ - రియల్ టైమ్ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వేసవిలో ఎక్కడా కూడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు ఎక్కడైనా సరే తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడే

...మిగతా 2లో

## ఫోన్ పే, గూగుల్ పే ద్వారా పీఎఫ్ విత్ డ్రా

**ఢిల్లీః** ఉద్యోగులకు భారీ శుభవార్త లభించింది. పీఎఫ్ డబ్బులు పొందడం ఇక మరింత సులభతరం కాబోతోంది. బ్యాంకుల వద్దకు వెళ్లి క్యూ కట్టే పద్ధతికి స్వస్తి పలికే రోజులు రాబోతున్నాయి. ఏటీఎం కేంద్రాలతో పాటుగా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా కూడా ఈపీఎఫ్ ఖాతాలోని నగదును ఉపసంహరించుకునే వెసులుబాటు అందుబాటులోకి రానుంది. ఇందుకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ప్రతిపాదనలకు కార్మిక శాఖ ఆమోదం తెలిపిందని ఆ శాఖ కార్యదర్శి సుమితా దావ్రా తెలిపారు. ఈ ఏడాది మే లేదా జూన్ నుంచి ఉద్యోగులు పీఎఫ్ మొత్తాలను ఏటీఎం, యూపీఐ ద్వారా విత్ డ్రా చేసుకునే సదుపాయం అందుబాటులోకి రానుందని చెప్పారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

### ముగ్గురు మావోయిస్టులు మృతి

### మృత దేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

### ఈ ఏడాది ఇప్పటి వరకూ వంద మంది మృతి




**చర్ల, మార్చి 25 (మనం న్యూస్):** ఛత్తీస్‌గఢ్ అడవులు మరోమారు తుపాకీ మోతలతో దద్దరిల్లాయి. ఆపరేషన్ కగార్ లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎదురుకాల్పులలో తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాకు చెందిన 25 లక్షల రివార్డు కలిగిన మావోయిస్టు సుధీర్ అలియాస్ సుధాకర్ అలియాస్ మురళీతో సహా ముగ్గురు మృతిచెందారు. బీజపూర్ - దంతెవాడ జిల్లాల సరిహద్దులోని గీదం పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్సాపారా, నేలగూడ, బోడ్గా, ఈకేలి

...మిగతా 2లో

## ఏపీలో ఆస్తి పన్ను బకాయి దారులకు గుడ్ న్యూస్

**అమరావతి:** ఏపీలో ఆస్తి పన్ను బకాయిదారులకు మున్సిపల్ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. ఆస్తి పన్నుపై వడ్డీలో రాయితీ ప్రకటిస్తూ పురపాలకశాఖ నిర్ణయం తీసుకుంది. భవనాలు, ఖాళీ స్థలాలపై ప్రస్తుత సంవత్సరం చెల్లించాల్సిన మొత్తంతో పాటు, పాత బకాయిలపై వడ్డీని 50శాతం మేర మాఫీ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. 2025 మార్చి 31లోగా చెల్లించే బకాయిలకు మాత్రమే 50 శాతం వడ్డీ మాఫీ ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, పేరుకు పోయిన కోట్లాది రూపాయల ఆస్తి పన్ను బకాయిల వసూళ్ల కోసం వడ్డీ రాయితీ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది.

## రూ.4 వేల కోట్లు దేశం దాటించేశారు



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్లో వైకాపా ప్రభుత్వంలో మద్యం వ్యాపారంలో దిల్లీని మించిన కుంభకోణం జరిగిందని తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఆరోపించారు. ఏపీ కుంభకోణంతో పోల్చితే దిల్లీ స్కాం నీటిబొట్టంతే అని వ్యాఖ్యానించారు. ఐదేళ్లలో రాష్ట్రంలో రూ.99 వేల కోట్ల మద్యం వ్యాపారం జరిగితే అందులో రూ.18 వేల కోట్లు దుర్వినియోగమయ్యాయని పేర్కొన్నారు.

ఇవికాకుండా మరో రూ.4 వేల కోట్లను బినామీల పేరుమీద దుబాయ్, ఆఫ్రికాలకు తరలించినట్లు ఆరోపించారు. ఇందులో హైదరాబాద్కు చెందిన ఓ మౌలిక వసతుల కంపెనీ పేరుతో ఎన్.సునీల్రెడ్డి అనే వ్యక్తి రూ.2 వేల కోట్లు దుబాయికి తరలించారని ధ్వజమెత్తారు. ఈ లావాదేవీలపై ఈడీ దర్యాప్తు జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన సోమవారం లోక్సభలో ఫైనాన్స్ బిల్లుపై జరిగిన చర్చలో మాట్లాడారు.

### అశాస్త్రీయ విభజన.. ఆర్థిక అవకతవకలు

'ఆంధ్రప్రదేశ్ను అశాస్త్రీయంగా విభజించారు. రాష్ట్ర విభజన జరిగినప్పుడు రూ.16 వేల కోట్ల రెవెన్యూ లోటు ఉంది. 2014-24 మధ్య కాలంలో జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 17% నుంచి 14.4%కి తగ్గిపోతే.. ఏపీలో మాత్రం 24% నుంచి 35%కి పెరిగింది. అంటే రాష్ట్రం వ్యవసాయంపై ఆధారపడటం పెరిగిపోయింది. ఇదే సమయంలో సేవా రంగం

...మిగతా 2లో

## క్రికెట్ బెట్టింగ్‌కు యువకుడి బలి



**గుండ్లపోచంపల్లి, మనం న్యూస్:** క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడిన యువకుడు బలైపోయాడు. బెట్టింగ్‌లో రూ.లక్ష నష్టపోవడంతో యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నివాసముండే సోమేశ్(29) గౌడవెల్లి పరిధిలో రైల్వే పట్టాల మీద పడుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలలోకి వెళితే... ఏపీకి చెందిన అనకాపల్లి జిల్లా చోడవరం మండలం భోగాపురం గ్రామానికి చెందిన రమణ 25 ఏండ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు

...మిగతా 2లో

బెట్టింగ్స్ యాప్స్‌పై సుప్రీంలో పిల్ వేశానన్న కేఏ పాల్

2

## జగన్ వచ్చేది రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకే

### గోరంట్ల బుచ్చయ్య చౌదరి



**రాజమహేంద్రవరం:** నియోజకవర్గాల పునర్విభజనపై తెదేపా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంతో సీఎం, డిప్యూటీ సీఎం అంతర్గతంగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఎన్డీఏలో భాగస్వామ్యంగా ఉన్నందున బహిరంగంగా మాట్లాడకూడదని చెప్పారు. జనాభా విషయంలో దక్షిణాది రాష్ట్రాలు చాలా క్రమశిక్షణ పాటించాయని చెప్పారు. ఇప్పుడు జనాభా పేరుతో సీట్లు తగ్గించడం సరికాదన్నారు.

''నిన్న మాజీ సీఎం జగన్ అపర గోబెల్స్‌లా మాట్లాడారు. మరో మూడేళ్ల తర్వాత అధికారంలోకి వస్తానని ఆయన అంటున్నారు. ఆయన వచ్చేది రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకే. వైకాపా హయాంలోని లిక్కర్, మైనింగ్ కుంభకోణాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. జగన్ హయాంలో పంటలకు బీమా కూడా చెల్లించకపోవడంతో రైతులు రూ.వేల కోట్లు నష్టపోయారు. గత ప్రభుత్వం గ్రామాల్లో ఒక రోడ్డు కూడా వేయలేదు.

...మిగతా 2లో

## వాటి ధరలు ఎప్పుడు తగ్గిస్తారు

### కూటమి సర్కార్కు షర్మిల ప్రశ్న



**విజయవాడ:** ఏపీలో పెట్రోల్, డీజిల్ ధరలపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి స్పందించారు. పక్కనున్న రాష్ట్రాల్లో కంటే రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమంటూ వ్యాఖ్యలు చేశారు. కూటమిని గెలిపిస్తే ఇంధనంపై పన్ను తగ్గిస్తామని హామీ ఇచ్చారని.. ఇప్పుడు దానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఈరోజు పెట్రోల్ ధర రూ. 109.60 పైసలు, డీజిల్ ధర రూ 97.47 పైసలుగా ఉందన్నారు. పక్కనున్న తమిళనాడు రాష్ట్రంలో లీటరు పెట్రోల్ ధర రూ.100.86 పైసలు, డీజిల్ ధర రూ.92.39పైసలని తెలిపారు. అంటే తమిళనాడుతో పోల్చితే మన దగ్గర పెట్రోల్ మీద 9 రూపాయలు,

...మిగతా 2లో




## బంగ్లాలో తిరుగుబాటు?

### మహమ్మద్ యూనస్‌కు వ్యతిరేకంగా మిలిటరీ సమావేశాలు





**ఢాకాః** ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా అనంతరం బంగ్లాదేశ్ లో మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం నెలకొన్న విషయం విదితమే. అయితే, ఇప్పుడు ఆయనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చెలరేగే అవకాశం ఉన్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి ఆర్మీ వర్గాలు అత్యవసర సమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఈమేరకు పలు మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. బంగ్లా ఆర్మీ

...మిగతా 2లో

## ఇమ్రాన్ ఖాన్ విడుదల కోసం

### అమెరికా కాంగ్రెస్‌లో బిల్లు



**వాషింగ్టన్ః** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ఖాన్‌ను విడుదల చేయాలంటూ అమెరికా పార్లమెంటు దిగువ సభ కాంగ్రెస్‌లో బిల్లును ప్రవేశపెట్టారు. దీనిలో ఇమ్రాన్ ను ఓ రాజకీయ ఖైదీగా పేర్కొన్నారు. అంతేకాదు.. రాజకీయ ప్రత్యర్థులను వేధిస్తున్నందుకు పాక్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్‌పై ఆంక్షలు విధించాలని కోరారు. ప్రతినిధుల సభకు చెందిన జో విల్సన్, జిమ్మీ పనెట్టా 'పాక్ డెమోక్రసీ యాక్ట్'

...మిగతా 2లో

# సుపథం దర్శనంపై టీటీడీ ఎస్.డబ్ల్యూ.ఎఫ్ హర్షం

(మొదటి పేజీ తరువాయి)

టీటీడీలో నెలకొని ఉన్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించమని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. టీటీడీ ఉద్యోగులు, పెన్షనర్స్ కు ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని, ఇచ్చిన స్థలాల వద్ద సౌకర్యాలు మెరుగుపరచాలని టిటిడి హెల్త్ ఫండ్ ను బలోపేతం చేయాలని, రియంబర్స్మెంట్ సౌకర్యాన్ని కొనసాగించాలని, దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న మెడికల్ బిల్స్ రిలీజ్ చేయాలని, ఐదేళ్లుగా పెండింగ్ లో ఉన్న ప్రమోషన్లను పూర్తి చేయాలని, రెండు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలు భర్తీ చేయాలని, టీటీడీలో ఖాళీగా ఉన్న 8వేల పోస్టులు భర్తీ చేసి పని భారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. టిటిడి ఉద్యోగులు మరియు పెన్షనర్లకు పిలిగ్రీం అలవెన్స్ గత రెండు పిఆర్సిలుగా పెంచలేదని దానిని 2500 నుంచి 5000 రూపాయలకు పెంచవలసిందిగా విజ్ఞప్తి చేశారు. టీటీడీ ఉద్యోగ సంఘ ఎన్నికలు నిర్వహించాలని వినపత్రంలో పేర్కొన్నారు. టిటిడిలో చెల్లిస్తున్న వివిధ అలవెన్సులు, యూనిఫామ్, రిస్క్ అలవెన్సు, పెంచాలని టిటిడిలో ఆఫీస్ సబార్డినేట్స్ కు పెరిగిన పనిబారాన్ని తగ్గించాలని, వివిధ డిపార్ట్మెంట్లోని ఉద్యోగులకు కన్వర్షన్ ను అమలు చేయాలని, పదవి విరమణ పొందుతున్న వారికి టీటీడీ యాజమాన్యం సత్కరించే సాంప్రదాయాన్ని పునరుద్ధరించాలని, టీటీడీ ఔట్సోర్సింగ్, కార్పొరేషన్ మరియు సొసైటీ లలో పనిచేస్తున్న కార్మికులకు టైం స్కేల్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

టీటీడీ ఉద్యోగుల నివసించే గృహాలు ఆధునికరించాలని విజ్ఞప్తి చేశారు. టిటిడి కల్యాణ మండపాల్లో ఉద్యోగులు నిర్వహించుకునే కార్యక్రమాలకు ఉద్యోగులకు 80% రాయితీ ఇచ్చి కాషన్ డిపాజిట్ ఉద్యోగులకు మినహాయించాలని ఆ వినతి పత్రంలో వారు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో టిటిడి ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు పద్మనాభం, దయాకర్, శ్రీలక్ష్మి, ఆదిలక్ష్మి, హనుమంత రెడ్డి వేణు, ఆవుల నరేష్, పయ్యావుల రాజశేఖర్, ధారా రవికుమార్, చొక్క లింగం, కోనేటి బాలాజీ, వి. ముని కిరణ్, పవన్, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలపై ఒక్క పైసా భారం లేకుండా రాజధాని నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

'' ఏ రాష్ట్రానికి అయినా రాజధాని అవసరం. ప్రస్తుతం రాజధాని లేని రాష్ట్రం ఏపీ మాత్రమే. రూ.43 వేల కోట్లకు గతంలో మేము టెండర్లు పిలిచాం. అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆల్ ఇండియా సర్వీస్ భవనాలు దాదాపు పూర్తయ్యాయి. కానీ గత ప్రభుత్వం ఇదేమి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అనేక ఇబ్బందులు వచ్చాయి. ఐఐటీ మద్రాస్ నుంచి నిపుణుల బృందాన్ని పిలిచి బిల్డింగ్ నాణ్యత పరిశీలించి, కాంట్రాక్టర్లతో చర్చించి కొన్ని సమస్యలు పరిష్కరించాం. 90 శాతం పనుల టెండర్లు కంప్లీట్ అయ్యాయి'' ''ఇవాళ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ భవనాలను పరిశీలించాం. 186 భవనాలు మంత్రులు, జడ్జీలు, కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులకు వస్తున్నాయి. గెజిటెడ్ అధికారులకు 1440, ఎన్జీవోలకు 1995 నిర్మాణాలు వస్తున్నాయి. హైకోర్టు 16.85 లక్షల చదరపు అడుగుల్లో వస్తోంది. 250 మీటర్ల ఎత్తులో అసెంబ్లీ భవనం రానుంది. 15 రోజుల్లో కాంట్రాక్టర్లకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ప్రజలపై ఒక్క పైసా భారం లేకుండా రాజధాని నిర్మాణం పూర్తి అవుతుంది. వరల్ బ్యాంకు, ఏడీబీ నుంచి రుణాలు తీసుకున్నాం. ల్యాండ్ వాల్యూ పెరిగిన తర్వాత అప్పు తీర్చుతాం'' అని నారాయణ వెల్లడించారు.

# జగన్ వచ్చేది రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకే

(మొదటి పేజీ తరువాయి)

జగన్ మళ్లీ జైలు ఊచలు లెక్కించాల్సిందే. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం సహాయ నిధి ఇచ్చి ప్రజలను ఆదుకుంటున్నాం. మేలో తల్లికి వందనం, జూన్లో అన్నదాత సుఖీభవ అమలు చేయబోతున్నాం. రానున్న పుష్కరాలకు రాజమహేంద్రవరం చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ప్రణాళికలు చేస్తున్నాం. రాజమహేంద్రవరంలో 12 ఎకరాల్లో క్రికెట్ స్టేడియం నిర్మాణం జరగబోతుంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్నితో ఇప్పటికే మాట్లాడాను. గతంలో వైకాపా కార్యాలయానికి రాజమహేంద్రవరంలో అధికారులు తక్షణమే స్థలం ఇచ్చేశారు. తెదేపా కార్యాలయం కోసం స్థలం అడుగుతుంటే మాత్రం ఇవ్వడం లేదు'' అని గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు.

# రూ.4 వేల కోట్లు దేశం దాటించేశారు

(మొదటి పేజీ తరువాయి)

వాటా 51% నుంచి 41%కి పడిపోయింది. అందువల్ల కేంద్రం రాష్ట్రం అడుగుతున్న రెవెన్యూ లోటు భర్తీ చేయాలి. అశాస్త్రీయంగా జరిగిన రాష్ట్ర విభజనే కాకుండా గత ఐదేళ్ల ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక అవకతవకలు కూడా రాష్ట్ర ఇబ్బందులకు కారణం' అని పేర్కొన్నారు.

**బాహుబలి, పుష్పను మించి వసూళ్లు**

'బాహుబలి, ఆర్ఆర్ఆర్, పుష్ప సినిమాలు రూ.1700 కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల వరకు వసూలు చేశాయి. ఆంధ్రప్రదేశ్లో గత ఐదేళ్లలో మద్యం పేరిట అంతకు మించి వసూళ్లు జరిగాయి. ఈ కుంభకోణం పరిణామాలు పార్లమెంటులోనూ కనిపించాయి. దీనివల్లే రాజ్యసభలో ఇంకా నాలుగేళ్ల పదవీకాలం ఉండగానే ఒక ఎంపీ రాజీనామా చేసి, రాజకీయాల నుంచి నిష్క్రమిస్తున్నట్లు ప్రకటించారు. సినిమాలకు ప్రీ ప్రొడక్షన్, ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ ఉంటుంది. ఏపీ మద్యం కుంభకోణంలోనూ అదే శైలి కొనసాగింది. మేం అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్లో సంపూర్ణ మద్యనిషేధం విధిస్తామని గత పాలకులు ప్రీ పొడక్షన్ స్థాయిలో ప్రచారం చేశారు. నిషేధించకపోతే సాధారణ ప్రజలు తాగలేనంతగా మద్యం ధరలు పెంచుతామన్నారు. చౌకధరలకు మద్యం అమ్మాలని ఒత్తిడి తెచ్చి అంతర్జాతీయ బ్రాండ్లన్నింటినీ వెళ్లగొట్టారు.

రాష్ట్రంలోని 22 డిస్టిలరీలను చేజిక్కించుకోవడంతోపాటు 26 కొత్త కంపెనీలను ప్రారంభించారు. వాటిలో ప్రెసిడెంట్ మెడల్, హెచ్బీ గోల్డ్విస్కీ, ఎనీటైం గోల్డ్.. ఇలా రకరకాల బ్రాండ్లతో మద్యం తయారుచేయించారు. ఈ బ్రాండ్లను ఏపీఎస్బీసీఎల్ కొని, ప్రభుత్వ దుకాణాల్లో నగదు లావాదేవీల ద్వారా విక్రయించింది. 2019-24 మధ్య కాలంలో రిటైల్ దుకాణాల ద్వారా అమ్మిన మొత్తం రూ.99 వేల కోట్లలో కేవలం రూ.690 కోట్లు మాత్రమే నగదు రహిత లావాదేవీలు జరిగాయి. దేశంలో డిజిటల్ లావాదేవీలు ఆ అయిదేళ్లలో రూ.లక్ష కోట్ల నుంచి రూ.200 లక్షల కోట్లకు పెరిగితే ఆంధ్రప్రదేశ్ మద్యం అమ్మకాల్లో మాత్రం అది రివర్స్లో జరిగింది. ఇందులో దాదాపు రూ.18 వేల కోట్ల దుర్వినియోగం జరిగింది. ఇదంతా ఆంధ్రప్రదేశ్ ప్రజల సొమ్మే' అని శ్రీకృష్ణదేవరాయలు వివరించారు.

# అదనంగా లక్ష ఎకరాల్లో కాఫీసాగు విస్తీర్ణం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్లకు సీఎం సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఆర్థికంగా ఉన్నత స్థితికి తీసుకొచ్చేందుకు వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదాన్ని ముందుకు తీసుకొచ్చామన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేత్త ఉండేలా తమ ప్రభుత్వం అడుగులు వేస్తుందని సీఎం వెల్లడించారు.

**అరకు కాఫీని ప్రోత్సహించాలి..**

గిరిజన సంక్షేమంలో భాగంగా ఆరకు కాఫీని ప్రోత్సహించాలని నిర్ణయించామని సీఎం తెలిపారు. వచ్చే ఐదేళ్లలో అదనంగా లక్ష ఎకరాల్లో అరకు కాఫీ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని నిర్ణయించామన్నారు. కాఫీ సాగులో అంతరపంటగా వేసే నల్ల మిరియాలు, స్ట్రాబెర్రీ, అవకాడో, యాపిల్, జీడి వంటి పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలని సూచించారు. గిరిజన ఉత్పత్తుల పరిరక్షణకు అవసరమైతే డ్రోన్ టెక్నాలజీని వాడుకోవాలన్నారు. సేంద్రియ సేద్యానికి అరకులో మంచి అవకాశాలు ఉన్నాయని సీఎం చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో వనరులు ఉన్నాయని, ఆదివాసీల్లో చైతన్యం లేకే వెనకబడి ఉన్నారని సీఎం అభిప్రాయపడ్డారు.

రాష్ట్రంలో సొంత ఇల్లు లేని వారు ఎవరూ ఉండకూడదని సీఎం నిర్ణయించారు. వచ్చే నాలుగేళ్లలో ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించి ఇచ్చేలా కలెక్టర్లు పనిచేయాలని సూచించారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించారు.

# వాటి ధరలు ఎప్పుడు తగ్గిస్తారు

(మొదటి పేజీ తరువాయి)

డీజిల్ మీద 5 రూపాయలు ఎక్కువ ఉందన్నారు. అలాగే కర్ణాటకలో లీటరు పెట్రోల్ ధర రూ.102.90పైసలు, డీజిల్ ధర రూ.88.99పైసలు ఉందని.. కర్ణాటకతో పోల్చితే ఏపీలో పెట్రోల్ మీద లీటరుకు 7 రూపాయలు, డీజిల్ మీద 9 రూపాయలు ఎక్కువగా ఉందని చెప్పారు.ఇంతే కాకుండా పక్కనున్న తెలంగాణలో లీటరు పెట్రోల్ ధర. రూ 107.46పైసలు, డీజిల్ ధర రూ. 95.70పైసలుగా ఉందని అన్నారు. అంటే తెలంగాణతో పోల్చినా ఏపీలో లీటరు మీద 3 రూపాయలు అదనంగా ఉందని చెప్పుకొచ్చారు. పన్నులు ఘనం.. అభివృద్ధి శూన్యం ఇది రాష్ట్ర పరిస్థితి అంటూ విమర్శలు గుప్పించారు. పెట్రోల్, డీజిల్ మీద పన్నులు తగ్గింపుపై టీడీపీ, వైసీపీ పార్టీలవి నీచ రాజకీయాలని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారపక్షంలో మరో మాట అని ఫైర్ అయ్యారు. గత 10 ఏళ్లుగా రెండు పార్టీల ప్రభుత్వాలు చేసింది దారి దోపిడీ తప్పా మరొకటి కాదన్నారు. వ్యాట్ పేరుతో ఏ రాష్ట్రంలో లేనంతగా ప్రజలపై పన్ను పోటు విధించారన్నారు. దేశంలోనే అత్యధిక పన్నులు వేసిన రాష్ట్రంగా ముందువరసలో పెట్టి.. రాష్ట్ర ప్రజానీకాన్ని లూటీ చేశారని ఆరోపించారు. బాబు మొదటి 5 ఏళ్ల పాలనలో సుమారు రూ.20వేల కోట్ల మేర అదనపు పన్నులు వసూళ్లు చేస్తే.. నాడు ప్రతిపక్షంలో ఉన్న జగన్ బాదుడే బాదుడు అంటూ ఎద్దేవా చేశారు. తీరా అధికారం ఇస్తే ఆయనే బాదుడుకి బ్రాండ్ అంబాసిడర్ అయ్యారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.5 ఏళ్లలో రూ.25 వేల కోట్ల మేర ఇంధనం మీద అదనపు పన్నులు వసూలు చేశారన్నారు. ఇద్దరు కలిసి 10 ఏళ్లలో ప్రజల నుంచి రూ.50 వేల కోట్లు బాదేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాడు ప్రతిపక్షంలో ఉండగా పెట్రోల్, డీజిల్ ధరలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారని గుర్తుచేశారు. లీటరుకు 17 రూపాయలు తగ్గించాలని డిమాండ్ చేశారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఇంధనం ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు మీరు అధికారంలో ఉన్నారని... ఇచ్చిన హామీ ప్రకారం ఎప్పటి నుంచి ధరలు తగ్గిస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 17 రూపాయలు ధర తగ్గించి ఇచ్చిన హామీ వెంటనే నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని వైఎస్ షర్మిల వ్యాఖ్యలు చేశారు.

# ఆ పరిస్థితి రానీయొద్దు.. సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీనికోసం వేసవి కాలం పూర్తయ్యేవరకు జిల్లాలో తాత్కాలిక కాల్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మంచినీళ్ల సమస్య ఎక్కడైనా తలెత్తినా దాన్ని రియల్ టైమ్లో పర్యవేక్షించి పరిష్కరించాలని సీఎం చంద్రబాబు అన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను అన్నింటిని నీటితో నింపాలని సీఎం చంద్రబాబు సూచించారు.

ప్రజలకు తాగునీరు అందించే ఏర్పాట్లకు సంబంధించి ఎక్కడా కూడా నిధులకు కొరత లేదని, జిల్లా కలెక్టర్లు దీనిపైన ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వేసవి నీటి ఎద్దడి ఎదుర్కోవడంలో హేతుబద్ధంగా పనిచేయాలని, అప్పుడే ప్రజలు మన పనులను హర్షిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

**పీఎం సూర్యఘర్ పథకంపై సమీక్ష**

కలెక్టర్ల సమావేశంలో పీఎం సూర్య ఘర్ పథకంపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10 వేల రూఫ్ టాప్ యూనిట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆ ప్రకారం ఈ ఏడాది ఏపీలో 20 లక్షల రూఫ్ టాఫ్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

2 కిలోవాట్ రూఫ్ టాప్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.60వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.55 వేలను సబ్సిడీగా అందిస్తోందని తెలిపారు.

# ప్రసాదంపై జీఎస్టీ ఎత్తివేత



ఢిల్లీః వస్తు, సేవల పన్ను నుంచి ప్రసాదాన్ని మినహాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం లోక్ సభలో జరిగిన ఆర్థిక బిల్లు 2025పై చర్చలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రకటనలు చేశారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలకు ఎలాంటి జీఎస్టీ వర్తించబోదని స్పష్టం చేశారు.గానికి ఊతం ఇచ్చేందుకు, ఎగుమతులను ప్రోత్సహించేందుకు, సామాన్యులకు ఉపశమనం కలిగించేందుకే కస్టమ్స్ సుంకాలను హేతుబద్ధీకరిస్తామని నిర్మలమ్మ వివరించారు. అనంతరం ఈ ఆర్థిక బిల్లుకు లోక్సభ ఆమోదం.

# ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాల పరిధిలోని అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల పక్కా సమాచారంతో డిఆర్జి, కోబ్రా, సిఆర్పిఎఫ్, ఎస్టిఎఫ్, బస్తర్ ఫైటర్స్ బలగాలు కూంబింగ్ ప్రారంబించాయి. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల నడుమ పెద్ద ఎత్తున కాల్పులు చోటుచేసుకున్నాయి. కొద్దిసేపటి తర్వాత సంఘటనా ప్రాంతం వద్ద గాలించగా ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతిచెందిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, రూ 25 లక్షల రివార్డు కలిగిన వరంగల్ జిల్లాకు చెందిన సుధీర్ అలియాస్ సుధాకర్ ఉన్నాడు. మిగిలిన ఇద్దరు మావోయిస్టులను గుర్తించే పనిలో భద్రతా బలగాలు ఉన్నాయి. సంఘటనా ప్రాంతం వద్ద నుండి ఇన్సాస్ రైఫిల్స్, 303 రైఫిల్స్, 12 బోర్ తుపాకితో పాటు పేలుడు పదార్థాలు, విప్లవ సాహిత్యంను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఛత్తీస్ ఘడ్ లో జరిగిన వివిద ఎన్ కౌంటర్లలో 100 మంది మావోయిస్టులు మృతి చెందగా ఒక్క బీజపూర్ జిల్లాలోనే 85 మంది మావోయిస్టులు మృతి చెందడం గమనార్హం.

# తీహార్ జైలు తరలింపు

**హైదరాబాద్,** మనం ప్రతినిధిః ఆసియాలోనే అతిపెద్ద జైలుగా ఢిల్లీలోని తీహార్ జైలుకు పేరుంది. కరడుగట్టిన క్రిమినల్స్ ఎందరో తీహార్ జైల్లో ఉంటారు. తీహార్ జైలుకు సంబంధించి ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ శివారులో మరింత విశాలంగా మరో జైలును నిర్మిస్తామని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా అధికారికంగా ప్రకటన చేశారు. జైలు సర్వేకి రూ. 10 కోట్లు మంజూరు చేసినట్టు ఆమె తెలిపారు. ఖైదీలతో తీహార్ జైలు కిక్కిరిసిపోవడం, జైలు చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

ఢిల్లీలోని పశ్చిమ జనక్ పురి ప్రాంతంలో 400 ఎకరాల విస్తీర్ణంలో 1958లో తీహార్ జైలును నిర్మించారు. 10,026 మంది ఖైదీలు పట్టేలా ఈ జైలును నిర్మించడం జరిగింది. ప్రస్తుతం జైల్లో దాదాపు 19,500 మంది ఖైదీలు ఉన్నట్టు సమాచారం. ఈ రద్దీని తగ్గించేందుకు మండోలీ జైలు సముదాయాన్ని ఢిల్లీ ప్రభుత్వం నిర్మించింది. బాప్రోలా, నరేలా ప్రాంతాల్లో కొత్త జైళ్లను నిర్మించే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. తాజాగా, తీహార్ జైలునే మరో ప్రాంతానికి తరలించేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధమయింది.

# ఇమ్రాన్ ఖాన్ విడుదల కోసం

(మొదటి పేజీ తరువాయి)

పేరిట దీనిని తీసుకొచ్చారు. గ్లోబల్ మ్యాగ్నిట్స్కీ హ్యూమన్ రైట్స్ అకౌంటబులిటీ యాక్ట్ కింద ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ.. ఖాన్ రాజకీయ ఖైదీ అని స్పష్టంగా తెలుస్తోందన్నారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని పాక్ సైనిక నాయకత్వంపై ఒత్తిడి పెంచేలా వీసాపై బ్యాన్ విధించాలన్నారు. ఆ దేశంలో ప్రజాస్వామ్యం నెలకొల్పి ఇమ్రాన్ ను విడుదల చేయించాలని కోరారు.ఈ బిల్లు ప్రకారం అమెరికా ప్రభుత్వం 180 రోజుల్లో పాకిస్తాన్ లో రాజకీయ అణచివేతలకు పాల్పడుతున్నవారిని గుర్తించి జరిమానాలు, వీసా బ్యాన్లు విధించాల్సి ఉంటుంది. అమెరికాలోకి ప్రవేశించకుండా ఆంక్షలు అమలుచేయాలి. రాజకీయ ప్రత్యర్థులను ఉద్దేశపూర్వకంగానే అణచివేస్తున్నట్లు పాక్ ఆర్మీచీఫ్ ఆసీమ్ మునీర్ గురించి పేర్కొంది. ఇస్లామాబాద్ లో సైనిక పాలన అంతమైందని భావించినప్పుడు ఈ ఆంక్షలు తొలగించవచ్చు. ఇమ్రాన్ ఖాన్ ను 2022లో అవిశ్వాసతీర్మానం ద్వారా పదవి నుంచి తప్పించారు. 2023 ఆగస్టులో ఆయన్ను అవినీతి ఆరోపణలపై అరెస్టు చేశారు. దీనిని ఆయన మద్దతుదార్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ కేసులు మొత్తం సైన్యం ఒత్తిడితో రాజకీయ ప్రేరితమై మోపినవేనని



ఆరోపించారు. ఒక దశలో పీటీఐ పార్టీ ప్రజలతో కలిసి సైన్యంపై తిరగబడినా.. దానిని అణచి వేశారు. ఇమ్రాన్ మద్దతుదారులను జైళ్లలో వేశారు. మరోవైపు అమెరికాలోని డెమోక్రట్లు, రిపబ్లికన్లు ఇమ్రాన్ ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. తాజాగా ట్రంప్ కార్యవర్గం ఆయన విడుదలలో జోక్యం చేసుకొంటుందని పాకిస్థాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ సభ్యులు భావిస్తున్నారు. ట్రంప్ స్పెషల్ మిషన్స్ దూత రిచర్డ్ గ్రినెల్ కూడా ఇమ్రాన్ కు మద్దతు ప్రకటించారు.

# క్రికెట్ బెట్టింగ్‌కు యువకుడి బలి

(మొదటి పేజీ తరువాయి)

వచ్చి గుండ్లపోచంపల్లిలో నివాసం ఉంటున్నాడు. రమణ కుమారుడు సోమేశ్ దేవరయాంజాల్ పరిధిలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడిన సోమేశ్.. సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో బెట్టింగ్ పెట్టి రూ.లక్ష పోగొట్టుకున్నాడు. బెట్టింగ్‌లో పోగొట్టిన రూ.లక్షలో తాను పనిచేస్తున్న సంస్థకు చెందిన డబ్బులు కూడా ఉన్నాయి. అటు సంస్థలో, ఇటు ఇంట్లో డబ్బులు అడిగితే ఏమని సమాధానం చెప్పాలో అర్థం కాక.. విషయం తెలిస్తే తల్లిదండ్రులు ఏమంటారో అని సోమేశ్ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. డ్యూటీకి టైమ్ అవుతున్నప్పటికీ సోమేశ్ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు కంగారుపడి ఫోన్ చేస్తే.. కాసేపు ఆగి ఇంటికి వస్తానని చెప్పాడు. కానీ స్నేహితులకు మాత్రం తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. వారికి తన లొకేషన్ కూడా షేర్ చేశాడు. అది చూసి స్నేహితులు లొకేషన్ ఆధారంగా గౌడవెల్లికి వెళ్లేలోపే ప్యాసింజర్ రైలు కింద పడి సోమేశ్ ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# నిందితుడి గుర్తింపు?

**సిటీబ్యూరో, మనం న్యూస్:** సంచలనం సృష్టించిన ఎంఎంటీఎస్ రైలు ఘటనలో నిందితుడిని పోలీసులు గుర్తించారు. రైల్‌లో యువతిపై లైంగికదాడికి యత్నించిన నిందితున్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఘటన అనంతరం ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 13 బృందాలు ఏర్పాటు చేసి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. టాస్క్‌ఫోర్స్, ఎస్ఓటీ, సీసీఎస్, వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన పోలీసులు, రైల్వే పోలీసులు 28 కిలోమీటర్ల ప్రాంతంలోని రైల్వేస్టేషన్లను పరిశీలించారు. ముఖ్యంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి గుండ్లపోచంపల్లి వరకు 14 రైల్వే స్టేషన్ల ప్రాంతాలను జల్లెడపట్టారు. 200లకు పైగా సీసీ కెమెరాల పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి పలువురిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితుడిని గుర్తించడంలో కొంత జాప్యం జరిగింది. అల్వాల్ రైల్వే స్టేషన్ వద్ద మహిళా కోచ్‌లోకి ఓ నిందితుడు వచ్చినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. ఇప్పటికే పలువురు పాత నేరస్తుల ఫొటోలు బాధిత యువతికి చూపించగా నిందితుడిని గుర్తించలేదు. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు మేడ్చల్ జిల్లా గౌడవల్లి గ్రామానికి చెందిన జంగం మహేశ్‌గా గుర్తించారు. ఏడాది క్రితమే మహేశ్‌ను భార్య వదిలివేసింది. తల్లిదండ్రులు కూడా చనిపోవడంతో మహేశ్ ఒంటరిగా ఉంటున్నాడు. గంజాయికి బానిసైన అతడు పాత నేరస్థుడని పోలీసులు పేర్కొన్నారు.

# బంగ్లాలో తిరుగుబాటు?

(మొదటి పేజీ తరువాయి)

చీఫ్ జనరల్ వకార్- ఉజ్- జమాన్ నేతృత్వంలో ఈ అత్యవసర సమావేశం జరిగింది. ఇందులో ఐదుగురు లెఫ్టినెంట్ జనరల్స్, ఎనిమిది మంది మేజర్ జనరల్స్ సహా ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు. యూనస్ బాధ్యతలు చేపట్టినప్పటినుంచి బంగ్లా ప్రజల్లో అశాంతి, అపనమ్మకం పెరిగిందని ఆర్మీ వర్గాలు తెలిపాయి. దీంతో దేశంలో రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని వెల్లడించాయి. ఈక్రమంలో దేశంలో స్థిరత్వాన్ని పునరుద్ధరించడంలో ఆర్మీ పాత్ర ఎక్కువగా ఉంటుందనే దానిపై అధికారులు చర్చించారు. ఈసమావేశంలో దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించాలని యూనస్‌పై ఒత్తిడి తీసుకురావా లని ఆర్మీ అధికారులు నిర్ణయించారు. అంతేకాక.. సైన్యం పర్యవేక్షణలోనే జాతీయ ఐక్యత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని యోచిస్తుంది. ఇటీవల బంగ్లాలో సైన్యానికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు, విద్యార్థి నాయకులు స్వరం వినిపించారు. ఈక్రమంలోనే యూనస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు జరగనున్నట్లు సమాచారం అందింది. దీంతో దేశంలోని సైన్యం అలెర్ట్ అయ్యింది. ఢాకా అంతటా కట్టుదిట్టమైన గస్తీని ఏర్పాటుచేయడంతో పాటు పలు ప్రాంతాల్లో చెక్పోస్టు పెట్టింది. ఇక, హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ తిరిగి పుంజుకునేలా చేసేందుకు సైన్యం ఒక ప్రణాళికను రూపొందిస్తుందని విద్యార్థి పార్టీలు ఆరోపించాయి. అయితే, వీటిని సైన్యం ఖండించింది.

**యూనస్ చైనా పర్యటన..**

ఈ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో యూనస్ చైనాలో పర్యటించనున్నట్టు చైనా- బంగ్లాల మధ్య సంబంధాల్లో మార్పునకు ఈ పర్యటన దోహదపడుతుందని ఢాకా అధికారులు భావిస్తున్నారు.

# పోలీసులతో పెట్టుకోవద్దు?

**హైదరాబాద్,** మనం ప్రతినిధిః బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వార్నింగ్ ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత... రిటైర్ అయిన పోలీసు అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై రాజాసింగ్ మండిపడ్డారు. పోలీసులతో పెట్టుకోవద్దని ఆయన వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పుడు ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేసి జైలుకు పంపించారని గుర్తు చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత కూడా... గతంలో ఆయనను అరెస్ట్ చేయించిన వారిని ఏమీ చేయలేదని చెప్పారు.

# బెట్టింగ్స్ యాప్స్‌పై సుప్రీంలో పిల్ వేశానన్న పాల్

**హైదరాబాద్,** మనం ప్రతినిధిః ఇరు తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్స్ కలకలం రేపుతున్నాయి. పలువురు సెలబ్రిటీలపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. తాజాగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ బెట్టింగ్ యాప్స్‌పై సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశానని తెలిపారు. బెట్టింగ్ యాప్స్ డ్రగ్స్ కంటే ప్రమాదకరమైనవని ఈ విషయాన్ని గతంలో తాను ఎన్నోసార్లు చెప్పానని అన్నారు. అప్పుడు తన మాటలను ఎవరూ పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు.తెలంగాణలో బెట్టింగ్ యాప్స్‌పై బ్యాన్ ఉన్నప్పటికీ 978 మంది చనిపోయినట్టు అధికారిక గణాంకాలు చెపుతున్నాయని పాల్ తెలిపారు. ఈ యాప్స్‌ను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలు 72 గంటల్లో క్షమాపణ చెప్పాలని, నష్టపోయిన వారికి పరిహారం ఇప్పించాలని అన్నారు.

ఇది బెదిరింపు కాదని... ఈడ్చుకెళ్తానని హెచ్చరించారు. సినీ నటులు, క్రీడాకారులు, సెలబ్రిటీలను యువత రోల్ మెడల్‌గా తీసుకుంటుందని... కానీ, వారంతా సైతాన్లుగా మారారని... ఎంతో మంది చావులకు కారణమయ్యారని మండిపడ్డారు.



# శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- **ఈరోజు అంకురార్పణ**

**తిరుపతి(టీటీడి),మార్చి 25,మనం న్యూస్:** తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఆలయంలో మార్చి 27వ తేదీ నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న విషయం విదితమే. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.



ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 7.30 గంటల నుండి 9.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా ఆలయాన్ని శుద్ధి చేసి, పసుపు, కుంకుమ, చందనం, కర్పూరం, కిచిలిగడ్డ, కస్తూరి పసుపు, పచ్చాకు తదితరాలతో తయారుచేసిన సుగంధ మిశ్రమాన్ని గర్భాలయ గోడలకు ప్రోక్షణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

ఆలయానికి పరదాలు విరాళం :

శ్రీ కోదండరామాలయానికి మంగళవారం హైదరాబాదుకు చెందిన ప్రసన్నరెడ్డి అనే భక్తురాలు మూడు పరదాలు, నాలుగు కురాళాలు విరాళంగా అందించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ ముని శంకరన్, ప్రధాన అర్చకులు ఆనందకుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్చి 26న అనగా ఈ రోజు అంకురార్పణ :

శ్రీ కోదండరాముని బ్రహ్మోత్సవాలకు మార్చి 26వ తేదీ అనగా ఈ రోజు రాత్రి 7 గంటల నుండి 8.30 గంటల వరకు ఘనంగా అంకురార్పణ జరుగనుంది. ఈ సందర్భంగా సేనాధిపతి ఉత్సవం, మేదిని పూజ, మృత్సంగ్రహణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు ఇలా ఉన్నాయి

27-03-2025
ఉదయం - ధ్వజారోహణం (ఉదయం 9.15 గంటల నుండి 9.30 గంటల వరకు)
రాత్రి - పెద్దశేష వాహనం

28-03-2025
ఉదయం - చిన్నశేష వాహనం
రాత్రి - హంస వాహనం

29-03-2025
ఉదయం - సింహ వాహనం
రాత్రి - ముత్యపుపందిరి వాహనం.

30-03-2025
ఉదయం - కల్పవృక్ష వాహనం
రాత్రి - సర్వభూపాల వాహనం

31-03-2025
ఉదయం - పల్లకీ ఉత్సవం
రాత్రి - గరుడ వాహనం

01-04-2025
ఉదయం - హనుమంత వాహనం
రాత్రి - గజ వాహనం

02-04-2025
ఉదయం - సూర్యప్రభ వాహనం
రాత్రి - చంద్రప్రభ వాహనం

03-04-2025
ఉదయం - రథోత్సవం
రాత్రి - అశ్వవాహనం

04-04-2025
ఉదయం - చక్రస్నానం
రాత్రి - ధ్వజావరోహణం

వాహన సేవలు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 గంటల నుండి 8:30 గంటల వరకు నిర్వహిస్తారు.



## టీటీడీకి రూ.10.11 లక్షలు విరాళం

తిరుమల,మార్చి25,మనం న్యూస్: మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగరానికి చెందిన గౌరవ్ ఐరెన్ అనే భక్తుడు మంగళవారం శ్రీవేంకటేశ్వర సర్వ శ్రేయస్ ట్రస్టుకు రూ.10,11,111/- విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్ నాయుడుకు విరాళం డీడీని అందజేశారు. ఈ సందర్భంగా దాతను చైర్మన్ అభినందించారు.

## స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో విశ్వావసునామ సంవత్సరం పంచాంగ ఆవిష్కరణ

కాణిపాకం,మార్చి 25,మనం న్యూస్ః శ్రీ స్వామివారి ఆలయంలోని కళ్యాణ వేదికలో అట్టహాసంగా కాణిపాకం దేవస్థానం వారిచే దాతల సహకారంతో మొట్టమొదటిసారిగా ముద్రించిన 2025- 2026 శ్రీ



విశ్వావసునామ సంవత్సరం గంటల పంచాంగమును మంగళవారం రోజున ఆవిష్కరించడం జరిగింది, ఈ పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమమునకు శ్రీ కుప్పా విశ్వనాథ శాస్త్రి గారు తిరుపతి వారు, శ్రీ మార్తి వెంకట రామ శర్మ గారు, హైదరాబాద్ వారు, విచ్చేసి పంచాంగ ఆవిష్కరణలో పాల్గొని పంచాంగ విశిష్టతను ప్రవచనాలను తెలియజేశారు, ముందుగా పంచాంగములను శ్రీ స్వామి వారి దగ్గర ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి తర్వాత ఆలయంలో కల్యాణ వేదిక దగ్గర ఆవిష్కరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్, కాణిపాకం దేవస్థానం ఆస్థాన పంచాంగ కర్త, పంచాంగ రూపకర్త అత్తూలి శివకుమార్ శర్మ, ఏఈఓ లు రవీంద్రబాబు, ఎస్ వి కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, సూపర్డెంట్లు కోదండపాణి, వాసు, అర్చకులు, వేద పండితులు, ఆలయ ఉభయదారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులు అంద చేసిన ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి,మార్చి 25,మనం న్యూస్: తిరుపతి నియోజకవర్గంలోని ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందించారు. మంగళవారం మధ్యాహ్నం తన నివాసంలో లబ్ధిదారులకు చెక్కులు ఆయన పంపిణీ చేశారు. 42వ డివిజన్ పరిధిలోని శాంతినగర్ కు చెందిన సత్యనారాయణకు మూడు లక్షలా యాభై మూడు వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే అందించారు. అలాగే



9వ డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీ కాలనీకి చెందిన మునిబాలకు చెందిన చెక్కును ఆయన తల్లికి అందించారు. అనారోగ్యంపాలై ఆస్పత్రి ఖర్చులకు ఇబ్బంది పడుతున్న వారికి కుటుంబంలో పెద్దకొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు సిఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తుండటం నిజంగా వరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు రాజా రెడ్డి, మహేష్ యాదవ్, కెఎంకే లోకేష్, బత్తెన మధు, రుద్రకిషోర్, శిరీష, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాల ఆదాయంలో అనూహ్య మార్పులు

- **కలెక్టర్లకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం**

**చిత్తూరు,మార్చి 25,మనం న్యూస్:** మూడవ కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాల మధ్య తలసరి ఆదాయంలో వచ్చిన మార్పులపై కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 2022-23 సంవత్సరానికి గాను సత్యసాయి జిల్లాలో తలసరి ఆదాయం 2,19,234 రూపాయలు, అనంతపురం జిల్లాలో 2,33,521 రూపాయలు, డాక్టర్ బి.ఆర్.



అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1,93,763 రూపాయలుగా నమోదైంది. సాధారణంగా అనంతపురం జిల్లా కరువు పీడిత ప్రాంతంగా, వెనుకబడిన జిల్లాగా పరిగణించబడుతుంది. అయితే, కోనసీమలో తలసరి ఆదాయం ఎక్కువగా ఉంటుందని భావిస్తారు. ఉద్యానవన రంగంలో సాధించిన అభివృద్ధి కారణంగా అనంతపురం జిల్లాలు తలసరి ఆదాయంలో వృద్ధిని సాధించింది. తలసరి ఆదాయంలో ముందున్న జిల్లాలలోని ఉత్తమ విధానాలను వెనుకబడిన జిల్లాలలో కూడా అమలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, పశుసంవర్ధక రంగం అధిక ఆదాయాన్ని అందిస్తూ, ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తోందని, ఆ తర్వాత ఉద్యానవన, తయారీ రంగాలు ఉన్నాయని, ఈ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.

## పీఠాధిపతులను మర్యాదపూర్వకంగా కలిసిన టీటీడీ చైర్మన్

తిరుమల,మార్చి 25,మనం న్యూస్: పాలిమారు మఠం పీఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామిజీ, భీమనకట్టె మఠం పీఠాధిపతి రఘువరేంద్ర తీర్థ స్వామిజీలను తిరుమలలోని వ్యాసరాజ మఠంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడు మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా



కలిశారు. ఈ సందర్భంగా హిందూ ధర్మవ్యాప్తికి టీటీడీ చేపడుతున్న కార్యక్రమాలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాలతో దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు చైర్మన్ స్వామీజీలకు వివరించారు. భక్తులు సంతృప్తిగా తిరుమల యాత్రను పూర్తి చేసుకునేలా టీటీడీ పని చేయాలని పీఠాధిపతులు చైర్మన్ కు సూచించారు. శ్రీవారి అనుగ్రహంతో టీటీడీ తలపెట్టే అన్ని కార్యక్రమాలు సఫలీకృతం కావాలని స్వామీజీలు ఆశీస్సులు అందజేశారు. అనంతరం చైర్మన్ ను స్వామీజీలు పట్టు శాలువతో సన్మానించి, మహా భారతం గ్రంథాన్ని బహుకరించి ఆశీర్వదం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు నరేష్ కుమార్ పాల్గొన్నారు.

# యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ ప్రమాణ స్వీకారోత్సవానికి బీసీ కులాలు సన్నాక సమావేశం

**తిరుపతి,మార్చి 25,మనం న్యూస్:** తెలుగుదేశం పార్లమెంటు ఆఫీసులో మంగళవారం నాడు బీసీ కులాలు సన్నాక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి రజక సంఘం, గాండ్ల సంఘం, యాదవ సంఘం, నాయి బ్రాహ్మణ సంఘం, మత్స్యకారుల సంఘం, వడ్డెర సంఘం, వన్నెకుల, క్షత్రియ సంఘం, పట్టు శాలి సంఘం, శాలివాహన సంఘం, ఏప్రిల్ రెండో తారీకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 9 గంటలకు తిరపతి పార్లమెంటు జిల్లా అధ్యక్షులు, మాజీ తుడా చైర్మన్ తిరుపతి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ఏపీ యాదవ కార్పొరేషన్ గొల్ల నరసింహ యాదవ్ గారి ప్రమాణ స్వీకారోత్సవానికి తిరుపతి నుండి పెద్ద ఎత్తున బీసీ కులాలు ప్రమాణ స్వీకారానికి వెళ్లాలని ఈ సమావేశంలో అందరూ నిర్ణయించడం జరిగింది.



ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కరాటే చంద్ర,శాలివాహన సాధికార కమిటీ పార్లమెంటు అధ్యక్షులు ఆముదాల తులసీదాస్, యాదవ సాధికార రాష్ట్ర కమిటీ సత్తు మధుసూదన్ యాదవ్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునుస్వామి యాదవ్, రజక సాధికార కమిటీ శంకర్, బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షులు అక్కినపల్లి లక్ష్మయ్య, అధ్యక్షులు గరిటి చెంచే యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్లోత్సవంలో పాల్గొనడం ఎంతో పుణ్యఫలం

- **అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు రాజగోపాలరావు**
- **భజనమండల్ల గోవింద నామస్మరణతో మార్మోగిన నడకమార్గం**

తిరుపతి(టీటీడి),మార్చి 25,మనం న్యూస్: పూర్వం నుండి ఎందరో మహనీయులు మెట్ల మార్గంలో తిరుమలకు నడిచివెళ్లి స్వామివారి కృపకుపాత్రులయ్యారని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు రాజగోపాలరావు చెప్పారు. ఇలాంటి మెట్లోత్సవంలో పాల్గొనడం ఎంతో పుణ్యఫలమన్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం అలిపిరి పాదాలమండపం మెట్లోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రాజగోపాలరావు మాట్లాడుతూ శ్రీమాన్ అన్నమాచార్యులు, శ్రీకృష్ణదేవరాయలు లాంటి



మహనీయులు భక్తిప్రపత్తులతో తిరుమల కొండలను అధిరోహించి స్వామివారి వైభవాన్ని దశదిశలా వ్యాప్తి చేశారని వివరించారు. అలాంటివారి అడుగుజాడలలో నడిచి ఆ దేవదేవుని కృపకు అందరూ పాత్రులు కావాలనే తలంపుతో టీటీడీ మెట్లోత్సవాన్ని నిర్వహిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనంద తీర్థ చార్యులు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు మరియు ఆంధ్రప్రదేశ్కు చెందిన దాదాపు 700 మందికిపైగా భజనమండళ్ల సభ్యులు భజనలు చేసుకుంటూ తిరుమలకు చేరుకున్నారు.

# ప్రజల భద్రతే మా బాధ్యత అనే నినాదంతో ట్రాఫిక్ పై పోలీసుల అవగాహన సదస్సు

తిరుపతి క్రైమ్,మార్చి 25,మనం న్యూస్: తిరుపతి శ్రీజ పాల సంస్థలో పనిచేస్తున్న సుమారు 560 మంది ఉద్యోగులతో ట్రాఫిక్ మరియు రాంగ్ రూట్ లో వెల్లడం వల్లన కలిగే నష్టాలపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అంతే కాకుండా ట్రాఫిక్ పై ప్రత్యక్షంగా మరియు ఆన్లైన్ ద్వార ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ రవి మనోహరాచారి మాట్లాడుతూ రోడ్డుపైకి ఏ వాహనాన్ని అయిన తీసుకువచ్చే ముందు ట్రాఫిక్ నిబంధనలు పాటించి తోటివారికి నష్టం కలిగించకుండా వాహనాన్ని నడపాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే ట్రాఫిక్ లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించి తోటి వారికి ఆదర్శంగా నిలవాలన్నారు. అంతేకాకుండా ఈ మధ్యకాలంలో ప్రతి ఒక్కరూ రాంగ్ రూట్ లో వెళ్ళడం పరిపాటిగా మారింది, రాంగ్ రూట్ లో వెళ్ళడం వలన జరిగే అనార్ధాల గురించి వివరించారు.రాంగ్ రూట్ లో వెళ్ళితే ఇంటికి



త్వరగా వెళ్ళవచ్చని వెళ్లి... వారితో పాటు ఇతరులకు ఇబ్బంది కల్గిచడంతోపాటు రోడ్డు యాక్సిడెంట్స్ కూడా జరుగుతున్నయన్నారు. ఇప్పటికైన ప్రజలు స్పందించి ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణ చారి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సుబ్బారెడ్డి,సంజీవ్ కుమార్, శ్రీజ సి.ఎం.ఓ. తిమ్మప్ప ఎస్.ఐ లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పులివర్తి నానికి పెండ్లిరోజు శుభాకాంక్షలు

- **తిరుచానూరు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కిషోర్ రెడ్డి**

తిరుచానూరు,మార్చి 25,మనం న్యూస్: శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు. ముందుగా ఆలయానికి విచ్చేసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులకు ఘనంగా సన్మానించి సాదర స్వాగతం పలికిన తిరుచానూరు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కిషోర్ రెడ్డి, ఆలయ ఏ ఈ ఓ దేవరాజులు, కూటమి నాయకులు, కార్యకర్తలు. అనంతరం అమ్మవారి కుంకుమ సేవలో పాల్గొని ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అలిమి నేని మధు, మధుశేఖర్, తిరుచానూరు టిడిపి గ్రామ కమిటీ



అధ్యక్షుడు కిషోర్ రెడ్డి, తిరుపతి రూరల్ జనసేన అధ్యక్షుడు వెంకట్ రాయల్, వాసు, హరి రామ్ రెడ్డి, దామ సాయి రాయల్, డిస్కో శివ, ఉమాపతి కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- **చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

చేవెళ్ల, మార్చి 25(మనం న్యూస్ )ః ముస్లిం , మైనారిటీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్లో పిఏసిఎస్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్

బండారు శైలజాగిరెడ్డిల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ భీం భరత్ లు పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షను



విరమింప జేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ....పవిత్ర రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు ఎంతో భక్తిశ్రద్ధలతో పాటిస్తారని, అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికీ ఉండాలని కోరారు. పవిత్ర మాసంలో చిన్నపిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయమన్నారు. రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఇఫ్తార్ విందులతో సోదర భావం పెంపొంది, ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు. అల్లా ఆశీస్సులతో ప్రతి ఒక్కరు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జి. పెంటయ్య. వైస్ చైర్మన్ బేగరి రాములు, మాజీ సర్పంచులు పడాల ప్రభాకర్, వెంకటేషం గుప్తా,మాజీ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, గంగి యాదయ్య, టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, మల్గారి మల్లారెడ్డి, బండారి వెంకట్రెడ్డి, మైనార్టీ నాయకులు, తదితరులున్నారు.

మనం Manam



## నెల నెల గండం

నేనేమి అడిగానని
అలా ఆశ్చర్యంగా చూస్తావు
నేను ఏమన్నానని
మూసిన పెదవులు పిల్ల కాలువలా సాగదీసి
లో లోపల నవ్వుకుంటావు

కూరగాయల దుకాణానికి వచ్చి
బంగారం అడిగినట్టు
మాంసం ముద్దు కాడ నిలబడి
ఉల్లి పాయలు జోకమన్నట్టు
అలా వింతగా చూస్తావెందుకు

నేను అడిగింది ఏమిటి?
అర్థమయ్యీ కానట్టు
వినబడీ వినబడనట్టు
ఇంకేదో వెతుకుతున్నావు

ముప్పయి రోజుల కాలచక్రం
గిర్రున తిరిగి
ఆమె నడక ఆగిపోయింది
నెల నెలా ఎటూ కదలని
నెత్తుటి గండం
కత్తిలా కోసుకు పోయింది
ఇంటి మనిషి పరాయి దానిలా
వోరకున్నది

ఏ పూట కా పూటా
ముందుచూపు బలమెక్కడిది
దూప అన్నప్పుడే బాయి తొవ్వుకున్నట్టు
ఉరుకూ అనంగనే
పరుగు పరుగున వచ్చి నీ గడప తొక్కినందుకు
నువ్వెందుకు ముసి ముసిగా
ఆయాసపడుతున్నావు

విస్పర్ అడిగినందుకు
అద్భుతం ఏదో చూసినట్టు
విస్మయం ప్రదర్శిస్తున్నావు
అమ్మకూడని వస్తువు
ఏదో అమ్ముతున్నట్టు
అడగకూడని సరుకు
ఏదో అడిగినట్టు
గోరింటాకు పెట్టుకున్న ఆషాఢం
కొత్త పెళ్ళికూతురులా
నువ్వెందుకు సిగ్గుల మొగ్గయితున్నావు

ఆడవాళ్ళ అవసరాలకు
ఆడవాళ్ళే ఇల్లు కదలాలా
ఆమె ఆపద
అతడు మోయ కూడదా

- గజ్జెల రామకృష్ణ
8977412795

# స్త్రీలు ఒంటరివారు కాదూ..



ప్రాచీనకాలం నుండి ఈనాటి 21 వ శతాబ్దం వరకు సమాజ గమనంలోమహిళల స్థితిగతులను గమనించినట్లైతే, వారి సామాజిక స్థితి ఎప్పుడు పురుషులతో సమాన హోదాలో లేదు. శతాబ్దాల నుండి మహిళలు రెండవ స్థాయి పౌరులుగానే చూడబడడం విచారించదగ్గ విషయం. పితృస్వామిక వ్యవస్థలో సామాజిక, రాజకీయ,ఆర్థిక, విద్యా, సాంస్క ృతిక రంగాలతో పాటు న్యాయవ్యవస్థలలో కూడా మహిళల స్థాయి ద్వితీయం అయిపోయింది. కుటుంబ వ్యవస్థల్లో వీరి పరిస్థితులు మరింతగా దిగజారిపోయింది. పునరుత్పత్తి, శ్రమశక్తి, లైంగికత, ఉత్పత్తి సాధనాలన్నీ, సంస్క ృతి, సంప్రదాయాల నియంత్రణలో నిర్బంధించబడి, రోజురోజుకు వారిపై ఆంక్షలు, అణచివేతలు, వివక్షల స్థాయి పెరిగిపోవడం శోచనీయం. స్త్రీ, పురుషుల మధ్యనున్న సామాజిక సంబంధాలను పరిశీలిస్తే, కుటుంబ సంస్క ృతి, సాంప్రదాయాల ఒత్తిడి పురుషుల కన్నా, స్త్రీలపైనే ఎక్కువగా వుంటుంది. సామాజిక జీవనంలో పురుషుల కన్న మహిళల స్థాయి దిగువనే అన్న భావజాలం ప్రతివారిలో జీర్ణించుకుని పోయి వుంది. స్త్రీల జీవితాలలో కులం, మతం ప్రధాన పాత్రను పోషిస్తాయి. ఆ వివక్షతోనే, కుటుంబ హింస, అత్యాచారాలు, హత్యాచారాల రూపంలో అవి వెంటబడుతు నానా జీవన్మరణ శాసనాలను లిఖిస్తోంది. అందుకు పితృస్వామిక భావజాలం 'అగ్నికి ఆజ్యం పోస్తున్నట్లు'గ స్త్రీలపై నియంత్రణను అమలుచేయడానికి ఎప్పుడూ సిద్దంగా వుంటుంది.

స్త్రీ, పురుషుల జీవ, శారీరక లక్షణాలు భిన్నంగా వుంటాయి. ఆధునికత అని చెప్పుకు తిరుగుతున్న పురుషుల వైఖరి మహిళల పట్ల, వారి దృక్పథం ఏమంత గొప్పగా వుండదు. మెజారిటీ పురుషులు సాంప్రదాయ దృక్కోణం నుంచే స్త్రీలను చూడడం చేస్తారు. పురుషస్వామ్య వ్యవస్థలో స్త్రీల పట్ల పురుషుల వైఖరి అనేక సమస్యలను సృష్టిస్తు వారిని మానసికంగా ఎదగకుండా చేస్తువుంటుంది.

కుటుంబ వ్యవస్థలో స్త్రీలు తక్కువ, పురుషులు ఎక్కువ అనే వివక్ష తరతరాలుగా సమాజంలో వుండిపోవడం వల్ల స్త్రీలపై అనేక ఆంక్షలు, ఒత్తుడులు ఎక్కువ అయ్యాయనే చెప్పాల్సి వుంటుంది. అందులో కులం, మతం స్త్రీలపై మరింత ఒత్తిడిని పెంచి స్త్రీల కట్టు,బొట్టు, తిండి,వస్త్రధారణ, అలవాట్లు,అభిరుచులు,అభిమతాల వరకు ఆమెను ఆజ్ఞాపిస్తూ, శాసిస్తూ, నిషేధాలను విధించే స్థాయికి వ్యవస్థ ఎదగడం ఎంత దుర్మార్గం?

కుటుంబ వ్యవస్థ ప్రధానంగా స్త్రీలను పిరికి వారిగాను, బలహీనులుగాను, సహనం, ఓర్పు, భావోద్వేగం కలవారుగా నిర్ణయిస్తుంది, పురుషులను ధైర్యవంతులుగాను, బలం, సామర్థ్యం, దూకుడు కలవారుగా ఆపాదించి, స్త్రీలపై ఆధిపత్యం చేయడాన్ని జెండర్ రూపకంగా సమాజం ఆమోదిస్తున్నది. అదేవిధంగా కుటుంబ వ్యవస్థలో, స్త్రీలు ఏ పనులు చేయాలి, ఏవి చేయకూడదు, అందులో ప్రధానంగా ఇంటిపని, వంటపని, పిల్లల పెంపకం లాంటి పనులన్ని స్త్రీలకు సంబంధించినవిగా చెబుతూ, పురుషులు కేవలం కుటుంబం వెలుపల కష్టపడి పని చేయాలని సూచిస్తుంది.

వివిధ స్థాయిలలో స్త్రీ,పురుషుల మధ్య వున్న సంబంధాలు ఎప్పుడు, ఎక్కడా సమాన స్థాయిలో కనబడవు. అలాగే సమాజం కూడా మహిళలు మరియు పురుషులు భిన్నంగా ప్రవర్తించాలనే కోరుకుంటుంది. అందువలన సమాజంలో పురుషుల దృష్టికోణంలో స్త్రీలు బానిసలుగ, వస్తువులుగ, సొంత ఆస్తులుగా పరిగణిస్తున్నారు. అందువల్ల స్త్రీలు కుటుంబంలో అనేక రూపాలతో, అనేక రకాలుగా విభజించ బడటం చూస్తుంటాం. తల్లులుగా,భార్యలుగా, బిడ్డలుగా వారి స్థానం కుటుంబంలో అనేక ఒత్తుడులను ఎదుర్కోవల్సి వుంటుంది. దాంతో స్త్రీలు మానసిక, లైంగిక వేధింపులకు, హింసలకు బలైపోవడం వల్ల తమ జీవితాలపై పట్టును కోల్పోతారు. అధికారం మొత్తం కుటుంబ పెద్ద అయిన పురుషుడి చేతిలో వుండడంతో స్త్రీలు తమకు సంబంధించిన విషయాలతో పాటు, పిల్లల విషయాలలో కూడా స్వయం నిర్ణయాధికారం కోల్పోవడమో లేదా మరచిపోవడమో వారికి తెలియకుండానే జరిగిపోతుంది. అది ఎంత విషాదకరం?.


కుటుంబంలో స్త్రీలు, తల్లులుగా, అక్కలుగా, చెల్లెళ్లుగా, అత్తలుగా, అమ్మమ్మలుగా, నానమ్మలుగా వున్నప్పటికి 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అన్నట్లుగా అనేక విషయాలలో వివక్ష, అణచివేయబడడం మన చూస్తాం. అలా అణచివేతలను ఎదుర్కున్న స్త్రీలు వివిధ కారణాల వలన కుటుంబాలను దాటి బయటకు రావడం జరుగుతోంది. చదువు, హోదా, ఆర్థిక స్థోమత ఉన్న వారి కంటే, ఏ ఆధారం లేకుండా కుటుంబ వ్యవస్థ నుండి బయటకు వచ్చిన స్త్రీల జీవితాలు అనేక కష్ట, నష్టాలను ఎదుర్కోవలసి వస్తుంది. సాధ్యమైనంత వరకు ఏ స్త్రీ సమాజాన్ని ఎదిరించి, కుటుంబ వ్యవస్థ నుండి బయటకు వచ్చి బతకాలని కోరుకోదు. ఎలాంటి బలీయమైన కారణాలు లేకుండా ఏ స్త్రీ కూడా కుటుంబాన్ని వీడి బయటకు రావాలని అనుకోదు.

కుటుంబంలో స్త్రీలు అన్ని విషయాలలో సర్దుకు పోయినంతగా, పురుషులు ఏ విషయంలో కూడా సర్దుకుపోవడానికి ఇష్టపడరు. తరతరాలుగా వారిలో వున్న పురుష అహంకార స్వభావం, వారి మెదడ్లలో పితృస్వామిక భావజాలం పాతుకుని వుండడం వలన స్త్రీల ప్రతి కదలికను నియంత్రిస్తూ, వారిని కేవలం పని మనుషులుగా, పిల్లల్ని కని పెంచే యంత్రాలుగానే చూడడం సిగ్గుపడవల్సిన విషయం.

పెట్టుబడీదారి వ్యవస్థలో ప్రతి వస్తువుకు ఎక్స్‌పైరీ తేదీ వున్నట్లుగా, స్త్రీలు కూడా వృద్ధాప్యంలో పనికిరాని వస్తువులుగా చూస్తూ.. వారిని అనాథ శరణాలయాలకు తరలించడం నేటి ఆధునిక కుటుంబాలకు సహజసిద్ధమైన విషయమై పోయింది.

పురుషులు తమ లైంగిక స్వేచ్చ కోసం భార్యల పట్ల హింసా ధోరణులు ప్రదర్శిస్తున్నప్పుడు, చట్టబద్ధంగా విడిపోవడం పరువు తక్కువగా భావించే స్త్రీలు, భర్తల ఆగడాలను దిగమింగుతూ, కేవలం ఇండ్లకే స్త్రీలను పరిమితం అయిపోతారు. వారి ఆలోచనలను తుంచేసి, వారి ఆత్మగౌరవాన్ని కాలరాజేసి, వారిని కట్టు బానిసలుగా మార్చివేసే పురుషాధిక్యతను ప్రశ్నించే సాహసం ఎవరు చేయగలరు?

పెళ్లి సమాజం కోసం, పిల్లలు వారసత్వం కోసం అని మాత్రమే అని పురుషులు భావించడం వలన స్త్రీలపై కుటుంబ హింస మరింత ఎక్కువ అవుతోంది. పిల్లల సంరక్షన బాధ్యత తల్లిదండ్రులిద్దరిదీ అయినప్పటికీ, పిల్లల్ని పెంచే విషయంలో పురుషులు ఆ నిబద్ధతను అస్సలు పాటించరు. ఈ సందర్భంగా భార్యలుగా స్త్రీలు భర్తల, ఇతర కుటుంబ సభ్యుల అసహనాల నడుమ పిల్లల్ని పెంచవల్సి వస్తుంది.



స్త్రీలు కుటుంబ హింసలను భరించలేక ఇంటిని వదిలి బయటకు వస్తే, ఆమె పట్ల సమాజం చాలా చిన్నచూపు చూస్తుంది. భర్తను విడిచి వచ్చిన 'బరితెగించిన ఆడది' అంటూ అవమానాలను ఆమె మోయవలసి వస్తుంది. ఇలాంటి సందర్భాలలో స్త్రీలు తమ పిల్లల పూర్తి బాధ్యత వహించాల్సి వుంటుంది.. ఒకవేళ పిల్లల్ని భర్త దగ్గరే వదిలి వచ్చిన స్త్రీలను సమాజం మరింత హీనాతి హీనంగా చూస్తుంది. అందువల్ల చాలామంది స్త్రీలు తమ పిల్లల జీవితాలు విచ్ఛిన్నం కాకూడదన్న సదుద్దేశంతో పిల్లలతో సహా కుటుంబాలను వదిలివేసి రావడం జరుగుతుంది. .

ఈ సందర్భంలో ఒంటరి స్త్రీలుగా వారి జీవన పోరాటం మరింత దుర్భరమవ్వడం వాస్తవం. ఇల్లు, కుటుంబం, పెళ్లి, మాతృత్వం ఇవన్నీ స్త్రీలను నియంత్రించడానికి పురుషులకు ఉపయోగ పడే సాధనాలు. అదే భావజాలం సమాజంలో కొన్ని శతాబ్దాలుగా వేనూళ్లుకుని పోయివుంది. పరువు, మర్యాద, కట్టుబాట్లను వదిలించుకుని బయటపడడం అనేది స్త్రీలకు మరింత కష్టం. ఒకరకంగా చెప్పాలంటే అసాధ్యం.

ఒంటరి స్త్రీలు అంటే ఎవరు? అనే ప్రశ్న వచ్చినప్పుడు కేవలం భర్త చనిపోయిన తర్వాత జీవించే వారిని మాత్రమే సమాజం ఒంటరివారిగా గుర్తిస్తోంది. చాలామంది ఒంటరిగా జీవించడం అంటే ఏకాకిగా బతకడం అని అపోహపడుతూ వుంటారు. ఏకాకితనం, ఒంటరితనం అనే పదాలు రెండు కూడా వేరు వేరు. వివాహ వయసు వచ్చినప్పటికి పరిస్థితుల ప్రభావంతో లేదా ఇష్టపూర్వకంగా వివాహాలు మానేసి, స్వయంకృషితో జీవించే మహిళలు సమాజంలో కోకొల్లలుగా వున్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక లేదా పేదరికం లాంటి అనేక కారణాల వలన భర్తలకు దూరంగా వుండి, పిల్లలను పోషణ చూసుకుంటూ స్వశక్తి మీద జీవిస్తున్న వారి సంఖ్య తక్కువ కాదు. కొందరు మహిళలు వైవాహిక జీవితాలలో పొడచూపిన అనేక వివాదాల వలన కుటుంబానికి దూరంగా వుంటే, వారిని ఒంటరివారిగా సమాజం చిత్రీకరించడం మరింత దారుణమైన విషయం.

ఇతర కుటుంబ సభ్యులకు దూరంగా వుండి కేవలం భర్తకు దగ్గరగా వున్న స్త్రీలలో అనేకమంది మానసికంగా, శారీరకంగా అనేక అంశాలను విభేదిస్తు కూడా, కేవలం పిల్లల కోసం, కుటుంబ పరువు, మర్యాదల కోసం భర్తలతో కలిసి జీవిస్తున్న స్త్రీల సంఖ్యను మనం సమాజంలో చూస్తే, చాలా అధిక సంఖ్యలోనే వారు వున్నారని చెప్పక తప్పదు.

ఏది ఏమైనా, సమాజంలో స్త్రీలు ఇప్పుడు అనేక అంశాలను చర్చకు పెడుతున్నారు. కేవలం వంటింటికి మాత్రమే మేము పరిమితం కాదలచుకోలేదు. అని చెబుతూనే.. అనేక రంగాలలో, అనేక సంస్థలలో పనిచేస్తూ పురుషులతో సమాన పనులకు సమాన హోదాను, సమాన వేతనాన్ని పొందడానికి ఒకవైపు పోరాటాలు చేస్తూ.. మరోవైపు తమ హక్కుల సాధనలో ముందుకు నడుస్తున్నారు. ఈ పరిణామం స్త్రీలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, వారికి ఆత్మగౌరవం కలిగే విధంగా సమాజం చేయూత నివ్వవలసిన అవసరం ఎంతైనా వుంది.

- భండారు విజయ
8801910908

# అంతరిక్ష పటం... స్పియరెక్స్ టెలిస్కోప్..!



ఆది మానవుల నుంచి నేటి ఆధునిక మాన వుల దాకా,శతాబ్దాల నాగ రికత వినీలాకాశంలోని అనంత నక్షత్రాల ఆవిర్భా వం గురించి అన్వేషణ కొనసాగిస్తూనే ఉంది. అసలు ఈ విశ్వం ఎలా ఏర్పడింది? గెలాక్సీలు, నక్షత్రాలు, గ్రహాలు వంటివన్నీ ఎలా ఏర్పడ్డాయి? భూమి లాంటి గ్రహాలు ఇంకా ఏమైనా వున్నాయా? మన లాంటి మనుషులు అంతరిక్షంలో వుండే అవకాశం ఎక్కడైనా వుందా? వాతావరణం మరియు నీళ్ళు ఇంకా ఎక్కడైనా వున్నాయా? వంటి ఎన్నో కోటానుకోట్ల ప్రశ్నలపై మనిషి జిజ్ఞాస,నిరంతర శోధన కొనసాగుతూనే వుంది. అనంత విశ్వ రహస్యాలను అధ్యయనం చేయడమే అంతిమ లక్ష్యంగా ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ వంటి ఎంతోమంది శాస్త్రవేత్తలు తమ జీవితాల్నే త్యాగం చేశారు. తాజాగా అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా చేపట్టిన భారీప్రయోగం స్పియరెక్స్ టెలిస్కోప్ అబ్జర్వేటరీ మళ్ళీ యావత్ ప్రపంచానికి ఓ సరికొత్త సవాల్ గా మారింది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ ఆధ్వర్యంలో కాలిఫోర్నియా నుంచి స్పియరెక్స్ టెలిస్కోప్ అబ్జర్వేటరీని, నాలుగు ఉపగ్రహాలతో కలిపి నాసా విజయవంతంగా అంతరిక్షంలోకి పంపింది.



అనంత విశ్వానికి సంబంధించిన పూర్తి ఖగోళ సమాచారం, అంతరిక్షపు పూర్తి చిత్ర పటం ను మానవాళికి అందించే ప్రధాన లక్ష్యంతో ఈ టెలిస్కోప్ అబ్జర్వేటరీ పనిచేస్తుంది.పాల పుంతల ఆవిర్భావం ఎలా జరిగింది? బిగ్ బ్యాంగ్‌కు సంబంధించిన కాస్మిక్ వెలుగుల జాడ ఎలా వుండేది? గెలాక్సీల సంఖ్య ఎంత? వంటి ఎన్నో సందేహాలకు త్వరలోనే మనం జవాబులు వెతక వచ్చు. ఇప్పటివరకు మన విజ్ఞానప్రగతి చూడని కొత్త కోణంలో విశ్వాన్ని ఆవిష్కరించబోతుంది ఈ ప్రయోగం. ఈ అబ్జర్వేటరీతో పాటు అంతరిక్షంలోకి వెళ్ళిన నాలుగు ఉపగ్రహాలు సూర్యుని ఉపరితల వాతావరణాన్ని అధ్యయనం చేస్తాయి. మన సౌర కుటుంబానికి సూర్యుడే అధిపతి. సూర్యుని ఆవిర్భావం గురించి సమగ్ర శాస్త్రీయ సమాచారం పొందితేనే మనం విశ్వ సరిహద్దుల అంతాన్ని చూడగలం. అనంత శక్తి విషయంలో సూర్యుని ఉపరితలంపై జరిగే రసాయన చర్యలపై శాస్త్రవేత్తలకు ఎన్నో అంతు చిక్కని ప్రశ్నలు శతాబ్దాలుగా సవాలు విసురుతూనే వున్నాయి. ఏనాటికైనా సూర్యునిపై మనిషి అడుగులు పెట్టాల్సిన అవసరం కోసం మానవ ప్రయత్నం నిరంతరం కొనసాగుతూనే వుంటుంది. 488 మిలియన్ డాలర్ల వ్యయంతో నిర్మించిన ఈ టెలిస్కోప్ అబ్జర్వేటరీ దాదాపు 500కేజీ ల బరువు ఉంటుంది. కోన్ ఆకారంలో ఉండే ఈ అబ్జర్వేటరీ పరారుణ కిరణాల సాయంతో అందమైన అంతరిక్షాన్ని పరిశీలిస్తూ ఆరు నెలలకొకసారి తాను దర్శించిన ఖగోళ పటానికి సంబంధించిన 3డీ చిత్రాన్ని రూపొందిస్తుంది. ఈ టెలిస్కోప్ అబ్జర్వేటరీ అందించే ఖగోళ సమాచా రం విశ్లేషణలో జేమ్స్ వెబ్ టెలిస్కోప్, హబుల్ టెలిస్కోప్‌లు కూడా సహాయకారిగా వుండబోతు న్నాయి. స్పియరెక్స్ అబ్జర్వేటరీ రెండు సంవత్సరా ల పాటు అంతరిక్షంలో తన విధులను నిర్వర్తిస్తూ విశ్వానికి సంబంధించిన సమగ్ర ఖగోళ సమాచా రంతో పాటు, బిగ్ బ్యాంగ్‌కు సంబంధించిన ఎన్నో రహస్యాల గుట్టును విప్పనుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనిలోని పరారుణ డిటెక్టర్‌లను రక్షించడానికి -210 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద వుంచారు. మానవ కళ్ళు సైతం చూడలేని అదృశ్య రంగులను కూడా స్పియరెక్స్ పసిగడు తుంది. స్పియరెక్స్ అందించే అంతరిక్ష చిత్రపటం ద్వారా నక్షత్రాల, గ్రహాల అంతర్గత నిర్మాణంతో పాటు ముఖ్యంగా ఖగోళంలో నీటి వనరులు ఎక్కడైనా వున్నాయా అన్నది సూక్ష్మంగా అధ్యయనం చేయనున్నారు. 20వ శతాబ్దపు శాస్త్రవేత్తల అన్వేషణలో బయటపడ్డ సంచలన సత్యాలైన గురుత్వాకర్షణ తరంగాలు, బ్లాక్ హోల్స్, విశ్వం విస్తరిస్తుండడం వంటి పలు అంశాలు విశ్వాన్ని అర్థం చేసుకోవడంలో, విశ్వార్భావం మరియు పరిణామ క్రమంలో ఎన్నో చిక్కుముడులను సృష్టించాయి. అయినా శాస్త్రవేత్తలు తమ ఆత్మవిశ్వాసంతో, అలుపెరగని బాటసారులుగా విశ్వ రహస్యాల అన్వేషణలో శతాబ్దాలుగా తమ ప్రయత్నాలను కొనసాగిస్తూ నే వున్నారు. చంద్రుడు, అంగారక గ్రహలపై బుడి బుడి అడుగుల ప్రయాణంలో కొంత పురోగతి సాధించారు. ప్రఖ్యాత ఖగోళ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ అన్నట్లు 'ఈ విశ్వం ఎంత పెద్దదైనా కావోచ్చు..! కానీ నీ ప్రయత్నం ముందు చాలా చిన్నదే..!'. నూతన వెలుగు రాకకై చీకటి దారిలో మనిషి వేసే ప్రతి అడుగు భవిష్యత్తు తరాలకు ఓ ముందడుగే..!. శాస్త్రీయ దృక్పథంతో త్వరలోనే అంతరిక్ష పరిశోధనల్లో ఎన్నో విప్లవాత్మక ఫలితాలు అనుభవంలోని వస్తాయని ఆశిద్దాం.

- ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

## కొండెక్కిన శాంతి దీపం

ఒప్పందాల శాంతి కపోతం
రెక్కలను యుద్ధకాంక్ష ఖడ్గాలతో
నరకబడినవి
సలపర గాయాల పైన
లేపనాల చిరుజల్లుల స్వప్నాలను
పైశాచిక అహంకార గద్దలు
పొడుచుకు తింటున్నాయి
నెత్తుటి అలల మీద ఊపిరి దీపాల
ఆర్తనాదాలు ఘోషల
పెడబొబ్బలను బాంబుల మోతలు
మింగేస్తున్నాయి.
రక్తపు మడుగుల్లో తెగిపడి
కొట్టుమిట్టాడుతున్న
మాంసపు ముద్దలకు ఆసరా
ఇస్తున్న చేతులను నరకివేస్తున్న
పైశాచికత

కృత్రిమ మెరుపులతో
ఎరుపును కాస్తున్న
ఆకాశం
కృత్రిమ సాయంత్రాలకు
వేలాడుతున్న నిర్జీవ
పిట్టల దేహాలు
పగలతో పగలును
ఎవరూ కలగనలేరు
ఉన్మాదం ఎపుడూ
చల్లని ఉదయాలను
ప్రసవించలేదు
వీడి ఉన్మాదం ఇంకొకడి వ్యాపారం

గాజా స్వేచ్ఛలను ఇజ్రాయిల్
గాలాలకు
ఎరలుగా గుచ్చారు
వాడి రక్తపుటేరుల
ప్రవాహాల్లో
వీడి అహాన్ని పడవలు
చేసి పందాలు
ఆడుతున్నాడు..
ఎన్ని పసి ప్రాణాలు తల్లి
పొత్తిళ్ళను కోల్పోయాయి?
ఎన్ని నెరిసిన ఉదయాలు
గాయాలను ఎత్తుకొని

సాయంత్రాలను తాకకుండా
సమాధయ్యాయి?
ఎన్ని మాతృ హృదయాలు తమ
రక్తపుమడుల్లో వెన్నెల
ప్రతిబింబాలను పట్టుకొని
చిట్టిచేతుల కోసం
కొట్టుమిట్టాడుతున్నాయి
యుద్ధోన్మాదం మానవాళి
నాశనానికి హేతువు
శాంతి సహనం సకల
సమస్యలపరిష్కార ధాతువు
అసమానలత మధ్య కడదాం
మమతల సేతువు
సర్వమానవ సౌభ్రాతృత్వానికి
చేపడదాం క్రతువు

- కొప్పోలు యాదయ్య

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు. - ఎడిటర్

# సహజ మేధస్సుకు కృత్రిమ మేధస్సు పెద్ద సవాల్



మానవులలో సహజ మేధస్సు అంటే జన్యుశాస్త్రం, పరిణామం అనుభవాల ద్వారా రూపొందించబడిన మెదడు యొక్క సహజ పనితీరు నుండి ఉత్పన్నమయ్యే అభిజ్ఞా (తలపు) సామర్థ్యాలు ప్రక్రియలు. ఇందులో అభిజ్ఞా విధులు, భావోద్వేగ ప్రక్రియలు, సృజనాత్మకత, సమస్య పరిష్కారం, సామాజిక నైపుణ్యాలు స్వీయ-అవగాహన ఉన్నాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ చేయబడిన కృత్రిమ మేధస్సు వలె కాకుండా, మానవ మేధస్సు జీవశాస్త్రం, భావోద్వేగాలు, అనుభవాలు పర్యావరణంతో నిరంతర పరస్పర చర్య ద్వారా రూపొందించబడింది. ఇది ఆలోచన యొక్క హేతుబద్ధమైన అంశాలకు మాత్రమే పరిమితం కాదు, సానుభూతి, సృజనాత్మకత వ్యక్తిగత వృద్ధిని కూడా కలిగి ఉంటుంది. అయితే, కృత్రిమ మేధ మానవ అభిజ్ఞా విధుల కంటే కలన గణితములు (అల్గోరిథంలు), డేటా గణన ప్రక్రియల ద్వారా పనిచేస్తుంది. కృత్రిమ మేధస్సు అనేది వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగం. ఇది నిర్దిష్ట పనులలో మానవ మేధస్సును అనుకరించగల లేదా అధిగమించగల వ్యవస్థలను సృష్టించడానికి ప్రయత్నిస్తుంది. వివిధ పరిశ్రమలలో సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి. కొత్త అవకాశాలను తెరవడానికి కృత్రిమ మేధస్సు గణనీయమైన సామర్థ్యాన్ని అందిస్తున్నప్పటికీ, ఉద్యోగాలు, గోప్యత, నిర్ణయం తీసుకోవడంపై దాని ప్రభావం గురించి నైతిక, సామాజిక, తాత్విక ప్రశ్నలను కూడా లేవనెత్తుతున్నది.

సహజ మేధస్సు (మానవ మేధస్సు) మరియు క త్రిమ మేధస్సు (ఎఐ) యొక్క పరస్పర ఆధారపడటం అనేది ఒక అవసరమైన సంక్లిష్టమైన సంబంధం. ఈ రెండు రకాల మేధస్సులు వాటి స్వభావంలో ప్రాథమికంగా భిన్నంగా ఉన్నప్పటికీ, ఒకటి జీవసంబంధమైనది, మరొకటి గణనపరమైనది. సహజ మేధస్సు, కత్రిమ మేధస్సుల మధ్య సంబంధం వ్యతిరేకత కంటే సహజీవనమైనది. కత్రిమ మేధస్సు అనేది మానవ సామర్థ్యాలను పెంచగల, విస్తరించగల మరియు విస్తరించగల శక్తివంతమైన సాధనం, అయితే క త్రిమ మేధస్సు చేయలేని నైతిక పర్యవేక్షణ, స జనాత్మకత, సూక్ష్మ నిర్ణయం తీసుకోవడానికి మానవ మేధస్సు అవసరం. కత్రిమ మేధస్సు యొక్క గణన శక్తితో మానవ జ్ఞానం, సజనాత్మకత, నైతిక విలువల కలయిక సమాజాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కోవడానికి అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది., అవి ఒకదానికొకటి కలిసి నిరంతరం మెరుగుపరుస్తూ శక్తివంతమైన భాగస్వామ్యాన్ని ఏర్పరుస్తాయి. సాధారణంగా కత్రిమ మేధస్సు (ఎఐ) మానవ మేధస్సును నాశనం చేస్తుందనే ఆందోళన, మన అభిజ్ఞా సామర్థ్యాలు, అభ్యాసం, సామాజిక పరస్పర చర్యలను ఎలా ప్రభావితం చేస్తుందనే దానిపై వివిధ వాదనల నుండి వచ్చింది. ఎఐ స్వయంగా సహజ మేధస్సును నేరుగా నాశనం చేయకపోయినా, అది రోజువారీ జీవితంలో కలిసిపోయిన విధానం మానవ అభిజ్ఞా సామాజిక అభివృద్ధిపై సూక్ష్మమైన ప్రభావాలను చూపుతుంది.

కృత్రిమ మేధస్సు మానవ మేధస్సును ఎలా ప్రభావితం చేస్తుంది?

ఏదైనా విషయం గుర్తుచేయుటకు, దిశలయొక్క గమనా గమనమునకు (నావిగేషన్), లెక్కింపులు వంటి సాధారణ అభిజ్ఞా పనులను కృత్రిమ మేధస్సు చేపట్టడంతో, మానవులు తమ స్వంత జ్ఞాపకశక్తి సమస్య పరిష్కార నైపుణ్యాలపై తక్కువ ఆధారపడవచ్చు. స్మార్ట్‌ఫోన్ బహుళ ప్రయోజనాలతో ఇకపై ఎక్కువ వాస్తవాలను గుర్తుంచుకోవాల్సిన అవసరం లేదు. ప్రపంచ స్థాన నిర్ణయ వ్యవస్థ(ఎఖి) సాంకేతికత ప్రాదేశిక అవగాహన అవసరాన్ని, మ్యాప్లను ఉపయోగించి మార్గాలను గుర్తుంచుకోవడానికి నావిగేట్ చేసే సామర్థ్యాన్ని తగ్గించింది. సెర్చ్ ఇంజన్ల వంటి అనేక కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలు వినియోగదారులు వెతకకుండానే సమాచారాన్ని అందిస్తాయి. కృత్రిమ మేధ ఆధారిత కమ్యూనికేషన్ సాధనాలు (చాట్బాట్లు మరియు సోషల్ మీడియా అల్గోరిథంలు వంటివి) నిజమైన మానవ పరస్పర చర్యను తగ్గించగలవు. కృత్రిమ మేధ ఖచ్చితంగా సృజనాత్మక ప్రక్రియలలో సహాయం చేయగలదు. ఆలోచనలు, కంటెంట్, డిజైన్లను పొందించడానికి కృత్రిమ మేధ పై అతిగా ఆధారపడటం మానవ సృజనాత్మకత తగ్గడానికి దారితీయవచ్చనే ఆందోళన ఉంది. ప్రజలు కృత్రిమ మేధ ఆధారిత సూచనలు లేదా కంటెంట్ ఎక్కువగా ఆధారపడటం ప్రారంభిస్తే, వినూత్నంగా ఆలోచించే లేదా అసలు ఆలోచనలను రూపొందించే వారి స్వంత సామర్థ్యం తగ్గిపోవచ్చు. కృత్రిమ మేధ ద్వారా వివిధ ఉద్యోగాలు, పరిశ్రమల ఆటోమేషన్ కూడా మానవ అభిజ్ఞా అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. ప్రజలు తమ సాంప్రదాయ పాత్రల నుండి స్థానభ్రంశం చెందినప్పుడు, ఈ ఉద్యోగాలకు అవసరమైన సమస్య పరిష్కారం, కమ్యూనికేషన్ , సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి వారికి అదే అవకాశాలు ఉండకపోవచ్చు. ఇది వ్యక్తిగత సామాజిక అభిజ్ఞా అభివృద్ధిలో స్తబ్దతకు దోహదం చేస్తుంది.

కృత్రిమ మేధస్సు ప్రభావాన్ని ఎలా తగ్గించాలి?

సహజ మేధస్సుపై కృత్రిమ మేధస్సు (ఎఐ) యొక్క ప్రతికూల ప్రభావాన్ని నివారించడం అంటే కృత్రిమ మేధస్సు అందించే ప్రయోజనాలను స్వీకరించడం, మానవ అభిజ్ఞా, భావోద్వేగ ,సృజనాత్మక సామర్థ్యాలను చురుకుగా నిర్వహించడం పెంపొందించడం మధ్య సమతుల్యతను కలిగి ఉండటం. కృత్రిమ మేధస్సు మన దైనందిన జీవితాల్లో మరింత సమగ్రంగా మారుతున్నందున, మానవులు వారి సహజ మేధస్సును పెంపొందించుకోవడం కొనసాగించేలా చూసుకోవడానికి ఉద్దేశపూర్వక చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం.. జీవితకాల అభ్యాసం, విమర్శనాత్మక ఆలోచనలో పాల్గొనడం, అభిజ్ఞా నైపుణ్యాలను కాపాడుకోవడం, మెరుగుపరచడం, కృత్రిమ మేధస్సు సాధనాలపై అతిగా ఆధారపడటాన్ని పరిమితం చేయడం, బలమైన నైతిక మరియు విమర్శనాత్మక చట్రాలను అభివృద్ధి చేయడం, కృత్రిమ మేధస్సు విద్య అవగాహనను ప్రోత్సహించడం, సమగ్ర శ్రేయస్సుపై దృష్టి పెట్టడం, మానవ-కేంద్రీకృత కృత్రిమ మేధస్సు అభివృద్ధిని ప్రోత్సహించడం వంటి అనేక వ్యూహాలు దీనిని సాధించడంలో సహాయపడతాయి. నిరంతర వ్యక్తిగత అభివృద్ధి నైతిక అవగాహనతో కలిపి కృత్రిమ మేధస్సు పరస్పర చర్యకు బుద్ధిపూర్వకమైన, సమతుల్య విధానాన్ని పెంపొందించడం మానవ మేధస్సు యొక్క ప్రత్యేక లక్షణాలను సంరక్షించడంలో సహాయపడుతుంది.

2025లో కృత్రిమ మేధస్సు ధోరణులు

2025లో ప్రపంచ కృత్రిమ మేధస్సు మార్కెట్ 243.72 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేయబడింది, ఉత్తర అమెరికా 51.58 బిలియన్లతో అగ్రస్థానంలో ఉంది, ఆసియా-పసిఫిక్ 32.89 బిలియన్లతో, యూరప్ 26.54 బిలియన్లతో ఉన్నాయి. ఎక్స్ప్లోడింగ్ టాపిక్స్ పూర్తి చేసిన పరిశోధన ప్రకారం, 77% కంపెనీలు తమ వ్యాపారాలలో కృత్రిమ మేధస్సు వాడకాన్ని ఉపయోగిస్తున్నాయి. 83% కంపెనీలు తమ వ్యాపార ప్రణాళికలలో కృత్రిమ మేధస్సు అగ్ర ప్రాధాన్యత అని పేర్కొన్నాయి. 2030 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కృత్రిమ మేధస్సు 15.7 ట్రిలియన్ల అమెరికన్ డాలర్లను అందిస్తుందని అంచనా వేయబడింది. 10లో 9 సంస్థలు పోటీ ప్రయోజనం కోసం కృత్రిమ మేధస్సు కి మద్దతు ఇస్తున్నాయి. 2025 నాటికి, కృత్రిమ మేధస్సు 85 మిలియన్ ఉద్యోగాలను తొలగించవచ్చు కానీ 97 మిలియన్ కొత్త వాటిని సృష్టించవచ్చు, ఫలితంగా 12 మిలియన్ ఉద్యోగాల నికర లాభం వస్తుంది. కృత్రిమ మేధస్సు మార్కెట్ పరిమాణం సంవత్సరానికి కనీసం 120% పెరుగుతుందని అంచనా వేయబడింది. ఫోర్బ్స్ సంస్థ ప్రకారం, వ్యాపారంలో కృత్రిమ మేధస్సు యొక్క అత్యంత సాధారణ ఉపయోగాలు కస్టమర్ సర్వీస్ లో 56%, సైబర్ సెక్యూరిటీ మోసం నిర్వహణ లో 51%, డిజిటల్ పర్సనల్ అసిస్టెంట్లు లో 47%, కస్టమర్ రిలేషన్షిప్ మేనేజ్మెంట్ లో 46%, ఇన్వెంటరీ మేనేజ్మెంట్ లో 40% గా అంచనా వేయబడింది. 2035 నాటికి 3.8 ట్రిలియన్ల లాభం అంచనా వేయబడింది.

ఈ కృత్రిమ మేధస్సు ఆధారిత యుగంలో, వ్యాపారాలు, వినియోగదారులు విధాన నిర్ణేతలు సహకరించడం అత్యవసరం. కృత్రిమ మేధస్సు ప్రయాణం ఇంకా ముగియలేదు. దాని నిజమైన సామర్థ్యం మన సమిష్టి చేతుల్లో ఉంది. మానవ మేధస్సు లేకుండా కృత్రిమ మేధస్సు లేదు. కృత్రిమ మేధస్సుని మానవులకు పూర్తి ప్రత్యామ్నాయంగా కాకుండా మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపయోగించే ఉత్పాదకత మెరుగుదల సాధనంగా చూడాలి.

- డాక్టర్. పి.ఎస్. చారి
8309082823

# రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

- చేనేతలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం
- త్వరలో మరిన్ని చేనేత ఎగ్జిబిషన్లు
- ఎగ్జిబిషన్ల ఏర్పాటుతో చేనేత వస్త్రాల అమ్మకాలు పెరిగాయన్న మంత్రి
- మంత్రి సవితకు నేతన్నల ధన్యవాదాలు
- ఎగ్జిబిషన్ల నిర్వహణతో రోజూ మాకు పని దొరుకుతోందని వెల్లడి






**విజయవాడ మార్చి 25 మనం బ్యూరో :** నేతన్నలకు 365 రోజుల పాటు పని కల్పించడంతో పాటు చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం మరిన్ని ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. నగరంలోని ఓ కల్యాణమండపంలో చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాల స్టాళ్లను మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. చేనేత వస్త్రాల అమ్మకాల కోసం రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాల్లోనూ ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రాబోయే ఉగాది సంబరాల నేపథ్యంలో విజయవాడలో చేనేత ఎగ్జిబిషన్ ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ లో రాష్ట్రానికి చెందిన పొందూరు, ఉప్పాడ, అంగర, పులగర్త, బందరు, మంగళగిరిచీరలు మరియు డ్రెస్ మెటీరియల్స్ చీరాల చీరలు మరియు డ్రెస్ మెటీరియల్స్ వెంకటగిరి,ధర్మవరం మదనపల్లి ఏమిగనూరు, గద్వాల్, కంచిపురం, పోచంపల్లి శారీల స్టాళ్లతో పాటు తెలంగాణ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, జమ్మూ కశ్మీర్, బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ కు చెందిన నేతన్నలు 89 స్టాళ్లు ఏర్పాటు చేశారన్నారు. ఎగ్జిబిషన్ లో పాల్గొన్న నేతన్నలందరికీ ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు.

**నేతన్నలకు ఇచ్చిన హామీల అమలు**

నేతన్నలకు 365 రోజుల పాటు పని కల్పించాలన్న లక్ష్యంతో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేనేతలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చిన విధంగా మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. నూలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నామన్నారు. ఆధునిక పని ముట్లను 90 శాతం సబ్సిడీ చేనేతలకు సరఫరా చేస్తున్నామన్నారు. ముడి సరకులు కూడా సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. త్రిఫ్ట్ పథకంలో ప్రభుత్వం వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచామన్నారు. గత ఏడాది 10 క్లస్టర్లు ఏర్పాటు చేశామన్నారు. జగన్ ప్రభుత్వం తొమ్మిది పర్యాయాలు విద్యుత్ ఛార్జీలు పెంచి, చేనేతలపై అధిక భారం మోపిందని మండిపడ్డారు.


**త్వరలో మరిన్నిఎగ్జిబిషనన్లు**

చేనేత వస్త్రాలకు మరింత మార్కెట్ సదుపాయం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా రానున్న రోజుల్లో మరిన్ని ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయనున్నామని మంత్రి సవిత తెలిపారు. రాబోయే తెలుగు సంవత్సర పండగను దృష్ట్యా ప్రజలందరూ సంప్రదాయానికి ప్రాధాన్యమిస్తూ చేనేత వస్త్రాలు ధరించాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

**రోజూ మాకు పని దొరుకుతోంది : నేతన్నల హర్షం**

అనంతరం చేనేత వస్త్రాలు, హ్యాండీ క్రాఫ్ట్ స్టాళ్లను సందర్శించారు. ఏ రాష్ట్రం నుంచి వచ్చారు...ఏయే వస్త్రాలు అమ్మకాలకు పెట్టారు..? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులు... మంత్రి సవితతో మాట్లాడుతూ, తరుచూ ఎగ్జిబిషన్లు నిర్వహించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడం వల్ల చేనేత వస్త్రాల అమ్మకాలు పెరిగాయని, రోజూ పని దొరుకుతోందని, దీంతో తమకు ఆదాయం పెరిగిందని స్టాళ్లు నిర్వాహకులు ఆనందం వెలిబుచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి తమకు మంచి రోజులు ప్రారంభమయ్యాయని నేతన్నలు ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, అబద్ధయ్య, పలువురు డైరెక్టర్లు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, జాయింట్ డైరెక్టర్ కన్నబాబు, ఆప్కో జీఎం రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

# నీట్ 4.0 తో ప్రెప్ ఇన్‌స్టా భాగస్వామ్యం



**గుంటూరు, మర్చి 25 (మనం న్యూస్) :** ప్రముఖ ప్లేస్మెంట్ సన్నాహక వేదిక ప్రెప్ఇన్స్టా ఇప్పుడు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) 4.0 నేషనల్ ఎడ్యుకేషనల్ అలయన్స్ ఫర్ టెక్నాలజీ కార్యక్రమంలో భాగమైందని సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా భారతీయ విద్యార్థులను పరిశ్రమకు కావాల్సిన నైపుణ్యాలు, పోటీతో కూడిన అంతర్జాతీయ ఉద్యోగ మార్కెట్కు సిద్ధం చేస్తుందన్నారు. దేశంలో సాంకేతిక విద్యను మార్చే ప్రెప్ఇన్స్టా కోర్సులు ఇప్పుడు నీట్ 4.0 పోర్టల్ ద్వారా పొందవచ్చన్నారు. 2019లో స్థాపించిన ప్రెప్ఇన్స్టా జనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్ వంటి అధిక డిమాండ్ ఉన్న రంగాలలో విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించడంపై దృష్టి పెడుతుందన్నారు. బిగ్ 4, ఫాంగ్ సహా అగ్రశ్రేణి ప్రపంచ కంపెనీలలో ప్లేస్మెంట్లు పొందడంలో విద్యార్థులకు ఈ కార్యక్రమాలు సాయపడతాయన్నారు. అంతే కాదు ప్రతి విద్యార్థి ప్లేస్మెంట్ ప్రక్రియ పూర్తిగా ట్రాక్ చేసేందుకు, వారి పనితీరు పర్యవేక్షించడానికి, అనుకూలమైన అసెస్మెంట్స్ నిర్వహించడానికి ఖ్చిఖి టూల్తో కాలేజీ మేనేజ్మెంట్కు ప్రెప్ఇన్స్టా సాయపడుతుందన్నారు. ప్రెప్ఇన్స్టా సహ-వ్యవస్థాపకుడు మనీష్ అగర్వాల్ మాట్లాడుతూ, ఏఐసీటిఈ, నీట్ కార్యక్రమంతో భాగస్వామ్యం భారతదేశంలో సాంకేతిక విద్య భవిష్యత్తు మార్చే దిశగా ఒక అడుగు వేసిందన్నారు. కెరీర్కు కావాల్సిన నైపుణ్యాలకు తగ్గట్టుగా విద్యార్థులను సిద్ధం చేసి వేగంగా ఎదుగుతున్న ఉద్యోగ మార్కెట్లో వారికి ఉద్యోగాలు వచ్చేలా చూడటం వచ్చే ఆర్థిక సంవత్సరంలో తన నెట్వర్క్ను 250+ కాలేజీలకు విస్తరించాలన్నది ధ్యేయంగా పెట్టుకుందన్నారు. 2019లో విద్యా మంత్రిత్వ శాఖ ప్రారంభించిన నీట్ కార్యక్రమం, విద్యార్థులు ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా అణిచివేతకు గురయ్యే నేపథ్యం కలిగిన వారికి సాంకేతిక విద్యా పరిష్కారాలు చూపి వారి ఉపాధి అవకాశాలు పెంపొందించడంపై ప్రధానంగా దృష్టి సారించిందన్నారు.

# కేంద్ర సహకార బ్యాంక్ అధికారులు బకాయిల పేరుతో రైతుల ఆస్తులను జప్తు చేసి అవమానించడం ఆపాలి



**కర్నూలు.మార్చి 25మనం న్యూస్ :** కేంద్ర సహకార బ్యాంకు,సొసైటీలు రైతులకు ఇచ్చిన రుణాలు రికవరీ పేరుతో చిప్పగిరి మండలం బెల్డోన, నగరడోన గ్రామాలతోపాటు ఆలూరు లో రైతుల ఇళ్ళలేక జొరబడి రైతుల ఆస్తులను బలవంతంగా ఇంటిలో ఉన్న వస్తువులను జప్తు చేయడం రైతులను అవమానించడం తక్షణమే ఆపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. అప్పులు చెల్లించడానికి కొంత సమయం కావాలని రైతుల కోరినప్పటికీ పట్టించుకోకుండా రైతులను తీవ్రంగా మనోవేదన గురి చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.జిల్లాలో కరువు కాటకాల కారణంగా పంటలు పండక రైతులు అప్పుల పాలై అనేకమంది ఆత్మహత్య చేసుకుంటున్నారని,పశ్చిమ ప్రాంతం ఆలూరు ఆదోని పత్తికొండ ఎమ్మిగనూరు మంత్రాలయం నుండి సుదూర ప్రాంతాలకు లక్షలాది కుటుంబాలు వలస పోయి జీవనం గడుపుతున్నారని,ఈ సమయంలో రైతులకు, ప్రజలకు భరోసా, ధైర్యం కల్పించాల్సిన ప్రభుత్వం రుణాల రికవరీ పేరుతో కేంద్ర సహకార బ్యాంకు,సొసైటీలు ఇచ్చిన రుణాలను బకాయిల వసూళ్ల పేరుతో బలవంతంగా రైతుల ఇళ్లలోకి త్వరపడి ఇంట్లో ఉన్న వస్తువులు ఏది దొరికితే అది దౌర్జన్యంగా ఎత్తుకెళ్లడం దారుణమని దీని కారణంగా రైతులు తీవ్రంగా మనోవేదన చెందుతున్నారని తక్షణమే బలవంతపు జప్తులకు స్వస్తి పలకాలని కేంద్ర సహకార బ్యాంకు అధికారులను కోరారు.ఈ విషయంలో తక్షణమే జిల్లా కలెక్టర్ గారు జోక్యం చేసుకొని భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా జిల్లాలో రైతులకు ప్రభుత్వము అండగా నిలబడాలని ఆయన డిమాండ్ చేశారు.

# గ్రామీణ జాతీయ ఉపాధి పేదల హక్కు



**జూపాడు బంగ్లా, మార్చి 25 (మనం న్యూస్) :** ఉపాధి హామీ చట్టం పేదల హక్కు పేదలు ఎర్రజెండా నాయకత్వాన పోరాడి సాధించుకున్న చట్టాన్ని పేదలకు దూరం చేయడానికి ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ ఆంక్షలు విధించి నిధులు తగ్గించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం కర్ణ .విమర్శించారు. మండలంలోని పారుమంచాలగ్రామంలో మంగళవారం ఉపాధి కూలీల దగ్గర కామ్రేడ్ గుంటూరు బాపనయ్య 47వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు బాపనయ్య చిన్నతనం నుంచే అంటరానితనం కుల వివక్షతకు భూస్వాములకువ్యతిరేకంగా పోరాడి కూలి రేట్లు పెంచి భూములు పంచిన ఘనత ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ గుంటూరు బాపనయ్యది అని ఆయన చివరి శ్వాస వరకు ఎర్రజెండా వదల లేదని పేదల రైతుల పక్షాన అలుపెరుగని పోరాటాలు చేశారని ఆయన ఆశయాల కొరకు వ్యవసాయ కూలీలు పేదలు ఐక్యం కావాలని ఐక్యమైనప్పుడే మన హక్కులు అమలు జరుగుతాయని ఆయన అన్నారు. భూస్వామ్య పెట్టుబడిదారీ ప్రభుత్వాలు ప్రజలను ఆకర్షించడానికి ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు ఇస్తారని వాటిని అమలు చేయాలని అడుగుతే అరెస్టులు చేయడము ఈ పాలక ప్రభుత్వాలకు సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఉపాధి పని చేసి మూడు వారాలు గడిచినప్పటికీ బిల్లులు మంజూరు చేయకపోవడం ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే బిల్లులు మంజూరు చేసి ఉపాధి పనులు కుటుంబానికి రెండు వందల రోజులు కల్పించి రోజు వేతనం 600 ఇవ్వాలనిపని దగ్గర వసతులు కల్పించి పనిచేసే వారందరికీ పనిముట్లు ఇవ్వాలని జాబ్ కార్డులు లేని వారికి జాబు కార్డులు ఇవ్వాలని ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాంబాబు .డివైఎఫ్ఐ తిరుమల్.ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



**శ్రీశైలం మార్చి 25 మనం న్యూస్:** శ్రీశైల భ్రమరాంబా దేవి అమ్మ వారికి మంగళవారం కొబ్బరి కాయలు సమర్పించారు.చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ లేదా శుక్రవారం రోజున (ఏ రోజుముందుగా వస్తే ఆ రోజు) భ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ సంవత్సరం ఏప్రిల్ 15న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు కొబ్బరి, గుమ్మడి, నిమ్మకాయలు సమర్పించడంఆనవాయితీ. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలోఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. కాగా ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన అమ్మ వారికి కొబ్బరి కాయలు సమర్పిస్తు వెంటనే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పిస్తారు.ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరి కాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతోపూజాదికాల తరువాత అమ్మవారికి సమర్పించారు.

# అర్చకుడి పై దాడి హేయమైన చర్య



**మహానంది, మార్చి25, (మనం న్యూస్):** కొలనుభారతి క్షేత్రం అర్చకుడి పై దాడిచేసి గాయ పరచడం హేయమైన చర్య అని మహానంది క్షేత్రం అర్చక సంగం,మహానంది దేవస్థానం ప్రధాన అర్చకులు అర్జున్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు జనార్దన్ శర్మ, శంకరయ్య శర్మ, సుబ్బయ్య శర్మ, ప్రకాశం శర్మ,రతయ్య బాబు, రాజు స్వామి, హరహరి శర్మ, మణికంఠ శర్మ,సురేంద్ర శర్మలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఆలయంలో పూజలు నిర్వహించే అర్చకునిపై అక్కడే తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి దాడి చేయడం మంచిది కాదన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసునమోదు చేసి, విదులనుండి తప్పించాలని డిమాండ్ చేశారు.

# కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్



**గరిడేపల్లి,మార్చి 25,(మనం న్యూస్):** గరిడేపల్లి మండలం రాయని గూడెం గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం సేవా కార్యక్రమాలను నిర్వహించారు.హుజూర్నగర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం -1స్పెషల్ క్యాంపులో భాగంగా మూడవరోజు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను చేపట్టారు.గ్రామంలోని డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్త చదారాన్ని మట్టి కుప్పలను తొలగించారు. గ్రామంలోని కాల్వపల్లి రోడ్డు,బొడ్రాయి బజారు ఇతర కాలనీలలోని రోడ్లను శుభ్రం చేయడమే కాకుండా మురుగు కాలవలలో పేరుకుపోయిన చెత్తను తొలగించి మురుగునీరు సక్రమంగా వెళ్లే విధంగా శుభ్రం చేశారు.కార్యక్రమంలో హుజూర్నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి నాగార్జున,ఎస్ బాలరాజు, కళాశాల అధ్యాపకులు డాక్టర్ నగేష్,దూపటి,వి లక్ష్మీనారాయణ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జె ఎ సి టి ఓ సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో వైభవంగా రాములోరి కల్యాణం నిర్వహించాలి



- వేములవాడ ఆర్డీఓ రాజేశ్వరరావు

**వేములవాడ, మార్చి 25 (మనం న్యూస్) :** శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం వేములవాడ యందు ఈనెల 30వ తేది నుండి ఏప్రిల్ 6 వరకు 8 రోజుల పాటు ఉగాది, శ్రీరామనవ రాత్రోత్సవములు వైభవంగా నిర్వహించుటకు మంగళవారం ఆలయ చైర్మన్ గెస్ట్ హౌస్ యందు వేములవాడ రెవెన్యూ అధికారి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ ఉద్యోగులు సంబంధిత ప్రభుత్వ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీరామనవమి రోజున రాజన్న ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం అశేషంగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నం దున ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని గౌరవ ఆర్డిఓ గారు అధికారులకు సూచించారు.ఈ నేపథ్యంలో ఆలయ ఈవో కె వినోద్ మాట్లాడుతూ రామనవమి కి వచ్చు భక్తులకు మంచినీటి సరఫరా మరియు క్యూ లైన్ లో ఏర్పాటు, పారిశుద్ధ్యపు పనులు,తాత్కాలిక మరుగుదొడ్లు, కళ్యాణ వేదిక లాంటి ఏర్పాట్లు నిర్వహించబడునని తెలియజేశారు.వేసవికాలం దృష్ట్యా భక్తులకు ఎటువంటి ఆరోగ్యపరమైన సమస్యలు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ వారిని కోరారు. అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు అరటి పండ్లు మరియు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.మహాశివరాత్రి జాతర ఏ విధంగానైతే అన్ని శాఖలు సమ న్వయంతో విజయవంతం చేశారో, అదేవిధంగా శ్రీరామనవమి రోజున కల్యాణ మహోత్సవం అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని ఆర్డీవో రాజేశ్వరరావు వివిధ శాఖల అధికారులను కోరారు.

# శ్రీశైలంలో మంగళవార పూజలు



**శ్రీశైలం మార్చి 25(మనంన్యూస్):** శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల పరివార దేవతలకు మంగళవారం విశేష పూజలు జరిపించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం స్వామి వారి ఆలయం వెనుక భాగంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షోడశోపచార పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ స్వామిని పూజించడం వల్ల వివాహం జరగని వారికి వివాహం అవుతుందని, సంతాన కలుగుతుందని భక్తుల నమ్మిక. సాయంత్రం సంధ్యా సమయంలో ఆరుబయట గల బయలు వీరభద్ర స్వామికి వివిధ రకాల జలాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రదోషకాలంలో ఆలయంలోని నందిమండపంలో కొలువైయున్న శనగల బసవన్నకు పంచామృత అభిషేకాలు, ఫలోదకాలు, వివిధ రకాల శుద్ధ జలాలతో పాటు మల్లికా గుండంలోని జలాలతో అభిషేకం చేశారు. అనంతరం వృషభ సూక్తం పురుష సూక్తం పఠించి శనగలు నైవేద్యంగా సమర్పించారు. లోక కళ్యాణం కోసం దేవస్థానం వారు సర్కారీ సేవగా ప్రతి మంగళవారం విశేష పూజలు జరిపిస్తున్నట్లు ఈవో అన్నారు.

# బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కలెక్టర్



**వేములవాడ, మార్చి 25 మనం న్యూస్) :** రాష్ట్ర బీసీ కమిషన్ బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్ జిల్లా పర్యటనకు రాగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కమిషన్ చైర్మన్, సభ్యులు సిరిసిల్ల, వేములవాడలో పర్యటించనున్న సందర్భంగా వారు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గెస్ట్ హౌస్ కు చేరుకోగా, కలెక్టర్ వారికి పుష్పగుచ్చం అందజేశారు.వారి వెంట వేములవాడ ఆర్డీఓ రాజేశ్వర్, ఆలయ ఈవో వినోద్ రెడ్డి జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్ రావు తదితరులు ఉన్నారు.

# మంత్రి పొన్నం చిత్రపటానికి పాలాభిషేకం



**హుస్నాబాద్,మార్చి 25,(మనం న్యూస్):** హుస్నాబాద్‌కు శాతావాహన యూనివర్సిటీ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసినందుకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.యూ.ఐ.ఆధ్వర్యంలో మంత్రి పొన్నం చిత్రపటానికి పాలాభిషేకం చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసారు. ఎన్.ఎస్.యూ.ఐ.పట్టణ అధ్యక్షుడు కూన విశ్వతేజ మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంతంలో గత 50 సంవత్సరాల నుంచి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మంత్రి పొన్నం వచ్చాక హుస్నాబాద్ అభివృద్ధిలో దూసుకుపోతుందని కొనియాడారు. ఎన్ఎస్‌యూఐ తరుపున కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీమూర్తి శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిన్నవేని విద్యాసాగర్, ఎన్ఎస్‌యూఐ నాయకులు రాహుల్, దొబ్బల అనిల్, తదితరులున్నారు.

# దేవాలయ భూములను కాపాడాలి

- వెయ్యి ఎకరాల దేవాలయ భూములు అక్రమాలకు గురవుతున్నాయి
- ప్రభుత్వానికి డిమాండ్ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్



**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 25(మనం న్యూస్):** వెయ్యి ఎకరాల దేవాలయ భూములు అక్రమకబ్జదారులు గురి చేస్తున్నారని ప్రభుత్వం తక్షణమే కాపాడాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మంగళ వారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పద్దులపైన చర్చలో ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణలో దేవాలయ భూముల ఆక్రమణ అనేది తీవ్రమైన సమస్యగా మారిందని తెలంగాణ రాకముందు 87235 ఎకరాల దేవాదాయ భూములు ఉండేవి అన్నారు. తెలంగాణ వచ్చిన తరువాత 20124 ఎకరాల దేవాదాయ భూములు కబ్జాకు గురి అయితే కేవలం 1146 ఎకరాలకు మాత్రమే కేసులు నమోదు అయ్యాయని అన్నారు. కబ్జాకు గురి అయినా మిగితా భూముల లెక్క ప్రభుత్వం దగ్గర ఉందా ? ఉంటె దాని పైన ఈ ప్రభుత్వం ఏం చర్యలు తీసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. వేలాది కోట్ల ఆదాయం దేవాలయాల నుండి వస్తుంటే వాటి నిర్వహణ అధ్వాన స్థితి లో ఉన్నాయని కేవలం 190 బడ్జెట్ తో వాటి అభివృద్ధి ఏ విదంగా సాధ్యమో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. దేవాలయాలు అన్ని కూడా పర్యవేక్షణలో ఉంచి వాటి కోసం ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేయాలి ఎందుకంటే గడిచిన సంవత్సర కాలం లో తెలంగాణ లో 100 పైగా హిందూ దేవాలయాలపైనా దాడులు జరిగితే ప్రభుత్వం అస్సలు ఎందుకు స్పందించలేదో స్పష్టం చేయాలన్నారు. ఇటీవల సికింద్రాబాద్లోని ముత్యాలమ్మ దేవాలయంలో దుర్గామాత విగ్రహం ధ్వంసం చేయబడింది, ఇది భక్తులలో ఆగ్రహాన్ని రేకెత్తించిందని.

అలాగే, శంషాబాద్లోని ఎయిర్పోర్ట్ కాలనీలో ఉన్న హనుమాన్ దేవాలయంలో నవగ్రహ విగ్రహాలు ధ్వంసం చేయడం జరిగింది, ఇది స్థానికుల్లో ఉద్రిక్తతను సృష్టించింది. ఈ సంఘటనలు భక్తుల భద్రతపై ప్రశ్నార్థకంగా నిలుస్తున్నాయని వాపోయారు. ఇటీవల దాడులలో విగ్రహాలు ద్వాంస మైన ప్రతిగుడికి పునః ప్రతిష్టాపనకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించేలా నిధులు కేటాయించాలని అన్నారు.


## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రోజుల జైలు శిక్ష

**నిజామాబాద్ క్రైమ్, మార్చి 25(మనంన్యూస్):** నిజామాబాద్ కేంద్రంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ రైల్వే స్టేషన్ దగ్గర వన్ టౌన్ పోలీస్ ఇన్స్పెక్టర్ రఘుపతి నిజామాబాద్ తన బృందం తో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా అందులో షేక్ జమీర్ తండ్రి షేక్ అహ్మద్ వయస్సు. 30 వృత్తి లేబర్ నివాసం డ్రైవర్స్ కాలనీ నిజామాబాద్ జిల్లా అను వ్యక్తి మద్యం సేవించి బండి నడుపుతు పట్టుపడగా బ్రీత్ అనలైజర్ ద్వారా చెక్ చేసి మద్యం సేవించినట్లు నిర్ధారించి, తాను మద్యం సేవించినట్లు స్పష్టంగా తెలిసిందన్నారు. అధికమవుతాదు 278 గా వచ్చిందనీ ఇతన్ని ఈ రోజు గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, గౌరవ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ (2) రోజుల జైలు శిక్ష విధించగా, ఇతన్ని జైలు కు తరలించడం జరిగింది. పట్టణ పరిధిలో ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే వారికీ కూడా ఇదే విధంగా శిక్ష పడుతుందని , కావున ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడుపవద్దు అని పోలీస్ వారికి వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రఘుపతి విజ్ఞప్తి చేశారు.

## ఎల్.ఆర్.ఎస్. ప్రక్రియను వేగవంతం చేయాలి

- కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, మార్చి 25 (మనం జిల్లా ప్రతినిధి):** ఎల్.ఆర్.ఎస్. ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఎల్.ఆర్.ఎస్. క్రింద దరఖాస్తుదారులు త్వరితగతిన ఫీజు చెల్లించి 25 శాతం రిబెట్ పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు దారులు సకాలంలో లే అవుట్ల క్రమబద్దీకరణ చేయించుకోవాలని తెలిపారు. దరఖాస్తు దారులు రుసుము చెల్లించిన 48 గంటల్లోగానే ప్రొసీడింగ్స్ జారీచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ



చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., లే అవుట్ల క్రమబద్దీకరణకు ఈ నెల 31 తో ముగిస్తున్నందున కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సి.హెచ్. రాజేందర్ రెడ్డి, డిప్యూటీ ఈఈ వెనుగోపాల్, టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ కు టీజీవో సంఘం వినతి పత్రం

- టీజీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్

**నిజామాబాద్ కలెక్టరేట్, మార్చి 24( మనం న్యూస్):** ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని మంగళవారం టీ.జి.ఓ. సంఘం ఆధ్వర్యంలో వివిధ ఎన్నికలలో విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు, అధికారులకు ఒక నెల గౌరవ వేతనంను వెంటనే ఇప్పించాలని టీ.జి.ఓ. సంఘం అధ్యక్షులు అలుక కిషన్, కార్యదర్శి అమృత్ కుమార్ నిజామాబాద్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. జిల్లాకలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత్ సానుకూలంగా స్పందించారు. వెంటనే సెక్షన్ ఆఫీసర్తో ఈ విషయాన్ని సమీక్షించి, ఆలస్యం చేయకుండా ప్రధాన ఎన్నికల అధికారి ( సీఈవో)కి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో తీసుకున్న త్వరిత చర్యను మేము అభినందిస్తున్నామన్నారు.

అదనంగా కలెక్టర్ కాంప్లెక్స్‌లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించడానికి ఐ డి ఓ సి లో సోలార్ ప్యానెల్లను ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తూ మేము మరొక వినతిపత్రాన్ని సమర్పించాము. ఈ చౌరవ ఇంధన సామర్థ్యం మరియు స్థిరమైన పాలనా పద్ధతులకు దోహదం చేస్తుంది. అంతేకాకుండా, ప్రస్తుతం కలక్టరేట్ ప్రాంగణంలో వాహనాలు



నిలుపు స్థలం ( పార్కింగ్) గురించి మేము ఆందోళనలను లేవనెత్తాము, ఇక్కడ వాహనాలు ప్రస్తుతం చాలా వేడి పరిస్థితులలో సరైన షెల్టర్ లేకుండా పార్క్ చేయబడుతున్నాయి. ఈ అసౌకర్యాన్ని మెరుగుపరచడానికి మరియు వాహనాలకు తగిన రక్షణ కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మేము అధికారులను కోరారు. అందరు ఉద్యోగుల ప్రయోజనం కోసం ఈ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని మేము ఆశిస్తున్నాము. ఈ కార్యక్రమంలో దేవి సింగ్, చందర్, దండు స్వామి, గంగాధర్, రామస్వామి, గోవర్ధన్, కీర్తిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

## వంచనతో శారీరక సంబంధం శిక్షార్హమే

- పెళ్లి ఇబ్బందుల అంచనా బాధ్యతను మహిళపై మోపడం సరికాదు
- దిల్లీ హైకోర్టు వెల్లడి

**ఢిల్లీ,మార్చి 25:** వివాహం చేసుకుంటాననే బూటకపు వాగ్దానంతో మహిళను నమ్మించి మోసం




చేసిన వ్యక్తి చట్టం పరిశీలన నుంచి తప్పించుకోజాలరని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. వివాహం బంధం వాస్తవ రూపం దాల్చడంలోని కష్టాలను ముందే అంచనా వేయాల్సిన అదనపు బాధ్యత వయసు రీత్యా తనకన్నా పెద్దదైన మహిళదేనని వాదించడం పురుషాధిపత్య, స్త్రీ ద్వేష దృక్పథంగానే పరిగణించాల్సి వస్తుందని జస్టిస్ స్వరణ కాంత శర్మ తెలిపారు. పెళ్లి చేసుకుంటానంటూ బలవంతంగా శారీరక సంబంధం పెట్టుకుని ఆ తర్వాత మోసం చేసిన వ్యక్తిపై దాఖలైన అత్యాచార కేసును కొట్టివేసేందుకు నిరాకరిస్తూ న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆరోపణల తీవ్రత దృష్ట్యా నిందితుడిపై దాఖలైన కేసును పూర్తిస్థాయి విచారణ జరగకుండానే కొట్టివేయడం సరికాదని తేల్చి చెప్పారు. సహ ఉద్యోగిగా ఉన్న వ్యక్తి తొలుత స్నేహితుడిగా మారి, ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని వెంటపడటంతో పాటు ఆమెకు వచ్చిన వివాహ సంబంధాలను తిరస్కరించేలా చేసి 2018 నుంచి 2021 వరకు మూడేళ్ల పాటు శారీరక సంబంధాన్ని కొనసాగించాడు. ఆమె నుంచి ఆర్థిక ప్రయోజనాలనూ పొందాడు. ఆ తర్వాత పెళ్లిచేసుకోవడానికి నిరాకరించడంతో పాటు తాను తీసుకున్న డబ్బును తిరిగి ఇచ్చేందుకు నిరాకరించగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. పరస్పర అంగీకారంతోనే వారిద్దరూ శారీరక సంబంధం కొనసాగించారన్న పిటిషనర్ తరఫు వాదనలను న్యాయమూర్తి తోసిపుచ్చారు.

## ట్రంప్ 'సోషల్' ప్రతిపాదన.. గ్రీన్‌కార్డు దారుల్లో గుబులు..!

**వాషింగ్టన్, మార్చి 25:** త్వరలో గ్రీన్‌కార్డు కలిగిన వారందరూ తమ సామాజిక మాధ్యమ ఖాతాల వివరాలను తెలియజేయాలని ట్రంప్ యంత్రాంగం ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాలో అక్రమ వలసదారుల ఏరివేత లక్ష్యంగా డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ దిశగా సోషల్ మీడియా ఖాతాలపై దృష్టిపెట్టిన ట్రంప్ ప్రభుత్వం.. ఆ పరిధిని మరింత విస్తరించాలని ప్రతిపాదించింది. దానికింద అమెరికాలో నివసిస్తోన్న గ్రీన్‌కార్డు దారులంతా తమ సోషల్ మీడియా ఖాతాల వివరాలను అప్పగించాల్సి రావొచ్చని తెలుస్తోంది. ఇప్పటికే వీసా దరఖాస్తుదారులు యూఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్‌కు తమ ఖాతాల వివరాలను వెల్లడించాల్సి ఉంది. కొత్త ప్రతిపాదన అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తోన్న, శాశ్వత నివాసం, ఆశ్రయం కోరుతున్న వారికీ వర్తిస్తుంది. ఈ ప్రక్రియ మెరుగైన గుర్తింపు ధ్రువీకరణను సాధ్యం చేస్తుందని, దేశ భద్రతకు సంబంధించిన ముప్పును నివారించేందుకు దోహదం చేస్తుందని అమెరికా ప్రభుత్వం గత నోటీసుల్లో పేర్కొంది. గ్రీన్‌కార్డు పొందినంత మాత్రాన వారికి అమెరికాలో ఎల్లకాలం ఉండిపోయే హక్కు లేదు అంటూ అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు లక్షల మంది వలసదారుల్లో, ముఖ్యంగా భారత సంతతి వారిలో గుబులు




రేపుతోంది. దీనికి అనుగుణంగానే గత కొన్ని వారాలుగా అమెరికా తమ వలస చట్టాలను కఠినతరం చేయడం వలసదారుల్లో ఆందోళనను పెంచుతోంది. ఇక తాజా ప్రతిపాదన కింద అమెరికా విధానాలు విమర్శించేవారు ఆ దేశాన్ని తమ నివాసంగా మార్చుకోకుండా నిరోధించే వీలు కలుగుతుంది. అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తూ, యూఎస్-భారత్ సంబంధాల్లో చురుకైన పాత్ర పోషిస్తోన్న పలువురు భారత సంతతి వ్యక్తులపై ఈ ప్రతిపాదనలు ప్రభావం చూపేలా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే రాజకీయ అంశాలపై స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేసే పరిస్థితి లేకుండా పోతుందనే విమర్శలూ వినిపిస్తున్నాయి.

ఇటీవల యూఎస్ ఇమిగ్రేషన్ అటార్నీ అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేశారు. హెచ్-1బీ, ఎఫ్-1, గ్రీన్‌కార్డు కలిగిన భారతీయులు ప్రయాణాల్లో అప్రమత్తత పాటించాలని సూచించారు. వీరు అమెరికాలో ప్రవేశించే, నిష్క్రమించే సమయంలో తనిఖీలు మరింత ఎక్కువగా ఉంటాయని, సహనంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 43 దేశాలకు చెందిన పౌరులు అమెరికాలోకి రాకుండా నిషేధం విధించాలని ట్రంప్ సర్కారు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్ ఈ ఆంక్షల జాబితాలో లేనప్పటికీ.. అమెరికా వెలుపల ప్రయాణాలు చేయాలనుకునే భారతీయులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. జనవరి 20న ట్రంప్ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయగానే.. అమెరికా ప్రజల రక్షణకు సంబంధించిన పలు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. ''గత నాలుగేళ్లలో అమెరికాలో అక్రమ వలసదారులు పోటెత్తారు. లక్షల మంది సరైన పత్రాలు లేకుండానే మన సరిహద్దులు దాటి దేశంలోకి వచ్చారు. ఆ తర్వాత ఇక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ దేశ భద్రత, ప్రజల రక్షణకు ముప్పుగా మారుతున్నారు. అందుకే అక్రమ వలసదారుల కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం'' అని ట్రంప్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## మహమ్మద్ యూనస్కు వ్యతిరేకంగా తిరుగుబాటు?

**ఢాకా, మార్చి 25:** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చెలరేగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా అనంతరం బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం నెలకొన్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చెలరేగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అక్కడి ఆర్మీ వర్గాలు అత్యవసర సమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఈమేరకు పలు మీడియాల్లో కథనాలు వస్తున్నాయి.



బంగ్లా ఆర్మీ చీఫ్ జనరల్ వకార్- ఉజ్-జమాన్ నేతృత్వంలో ఈ అత్యవసర సమావేశం జరిగింది. ఇందులో ఐదుగురు లెఫ్టినెంట్ జనరల్స్, ఎనిమిది మంది మేజర్ జనరల్స్‌తో సహా ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు. యూనస్ బాధ్యతలు చేపట్టినప్పటినుంచి బంగ్లా ప్రజల్లో అశాంతి, అపనమ్మకం పెరిగిందని ఆర్మీ వర్గాలు తెలిపాయి. దీంతో దేశంలో రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని వెల్లడించాయి. ఈక్రమంలో దేశంలో స్థిరత్వాన్ని పునరుద్ధరించడంలో ఆర్మీ పాత్ర ఎక్కువగా ఉంటుందనే దానిపై అధికారులు చర్చించారు. ఈసమావేశంలో దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించాలని యూనస్‌పై ఒత్తిడి తీసుకురావాలని ఆర్మీ అధికారులు నిర్ణయించారు. అంతేకాక.. సైన్యం పర్యవేక్షణలోనే జాతీయ ఐక్యత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని యోచిస్తుంది.

ఇటీవల బంగ్లాలో సైన్యానికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు, విద్యార్థి నాయకులు స్వరం వినిపించారు. ఈక్రమంలోనే యూనస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు జరగనున్నట్లు సమాచారం అందింది. దీంతో దేశంలోని సైన్యం అలెర్ట్ అయ్యింది. ఢాకా అంతటా కట్టుదిట్టమైన గస్తీని ఏర్పాటుచేయడంతో పాటు పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు పెట్టింది. ఇక, హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ తిరిగి పుంజుకునేలా చేసేందుకు సైన్యం ఒక ప్రణాళికను రూపొందిస్తుందని విద్యార్థి పార్టీలు ఆరోపించాయి. అయితే, వీటిని సైన్యం ఖండించింది. ఈ రాజకీయ గందరగోళం నేపథ్యంలో యూనస్ త్వరలోనే చైనాలో పర్యటించనున్నారు. చైనా- బంగ్లాల మధ్య సంబంధాల్లో మార్పునకు ఈ పర్యటన దోహదపడుతుందని ఢాకా అధికారులు భావిస్తున్నారు. రిజర్వేషన్ల వ్యతిరేక నిరసనల్లో పెద్దఎత్తున హింస చెలరేగిన నేపథ్యంలో గతేడాది ఆగస్టులో హసీనా (ఖీజ్చిజీజుజి ఏ్చఱజ్ప్పి) దేశం విడిచి పారిపోయిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి భారత్లో ఆమె తలదాచుకుంటున్నారు. ప్రస్తుతం మహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా వ్యవహరిస్తున్నారు.

## ఇమ్రాన్‌కు స్వేచ్ఛ.. : అమెరికా కాంగ్రెస్‌లో బిల్లు

**వాషింగ్టన్, మార్చి 25:** పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను జైలు నుంచి విడుదల చేయాలని అమెరికా చట్టసభలో బిల్లు ప్రవేశపెట్టారు. దీనిలో ఇమ్రాన్‌ను ఓ రాజకీయ ఖైదీగా పేర్కొన్నారు. అంతేకాదు.. రాజకీయ ప్రత్యర్థులను వేధిస్తున్నందుకు పాక్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్‌పై ఆంక్షలు విధించాలని కోరారు. ప్రతినిధుల సభకు చెందిన జో విల్సన్, జిమ్మీ పనెట్టా 'పాక్ డెమోక్రసీ యాక్ట్' పేరిట దీనిని తీసుకొచ్చారు. గ్లోబల్ మ్యాగ్నిట్స్కీ హ్యూమన్ రైట్స్



అకౌంటుబులిటీ యాక్ట్ కింద ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా విల్సన్ మాట్లాడుతూ.. ఖాన్ రాజకీయ ఖైదీ అని స్పష్టంగా తెలుస్తోందన్నారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని.. పాక్ సైనిక నాయకత్వంపై ఒత్తిడి పెంచేలా వీసాపై బ్యాన్ విధించాలన్నారు. ఆ దేశంలో ప్రజాస్వామ్యం నెలకొల్పి ఇమ్రాన్‌ను విడుదల చేయించాలని కోరారు. ఈ బిల్లు ప్రకారం అమెరికా ప్రభుత్వం 180 రోజుల్లో పాక్‌లో రాజకీయ అణచివేతలకు పాల్పడుతున్నవారిని గుర్తించి జరిమానాలు, వీసా బ్యాన్లు విధించాల్సి ఉంటుంది. అమెరికాలోకి ప్రవేశించకుండా ఆంక్షలు అమలుచేయాలి. రాజకీయ ప్రత్యర్థులను ఉద్దేశపూర్వకంగానే అణచివేస్తున్నట్లు పాక్ ఆర్మీచీఫ్ ఆసీమ్ మునీర్ గురించి పేర్కొంది. ఇస్లామాబాద్‌లో సైనిక పాలన అంతమైందని భావించినప్పుడు ఈ ఆంక్షలు తొలగించవచ్చు.

ఇమ్రాన్‌ఖాన్‌ను 2022లో అవిశ్వాసతీర్మానం ద్వారా పదవి నుంచి తప్పించారు. 2023 ఆగస్టులో ఆయన్ను అవినీతి ఆరోపణలపై అరెస్టు చేశారు. దీనిని ఆయన మద్దతుదార్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ కేసులు మొత్తం సైన్యం ఒత్తిడితో రాజకీయ ప్రేరితమై మోపినవేనని ఆరోపించారు. ఒక దశలో పీటీఐ పార్టీ ప్రజలతో కలిసి సైన్యంపై తిరగబడినా.. దానిని అణచి వేశారు. ఇమ్రాన్ మద్దతుదారులను జైళ్లలో వేశారు. మరోవైపు అమెరికాలోని డెమోక్రట్లు, రిపబ్లికన్లు ఇమ్రాన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. తాజాగా ట్రంప్ కార్యవర్గం ఆయన విడుదలలో జోక్యం చేసుకోంటుందని పాకిస్థాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ సభ్యులు భావిస్తున్నారు. ట్రంప్ స్పెషల్ మిషన్స్ దూత రిచర్డ్ గ్రినెల్ కూడా ఇమ్రాన్‌కు సోషల్ మీడియాలో మద్దతు ప్రకటించారు.

## నా కామెడీకి వేదికను కూల్చడం సరికాదు: కునాల్ కామ్రా


**ముంబయ్,మార్చి25:** యూనికాంటినెంటల్ హోటల్లోని హాబిటాట్ కామెడీ స్టూడియోను బృహన్ ముంబయ్ పురపాలక సంస్థ కూల్చివేయడంపై స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా స్పందించారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏకనాథ్‌శిండేపై స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఈ ఘటన అనంతరం వినోద కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన



యూనికాంటినెంటల్ హోటల్లోని హాబిటాట్ కామెడీ స్టూడియోను బృహన్ ముంబయి పురపాలక సంస్థ కూల్చేసింది. తాజాగా దీనిపై కునాల్ కామ్రా స్పందించారు. తాను కామెడీ చేయడానికి ఉపయోగించిన వేదికను కూల్చడం సరికాదన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. 'హాబిటాట్ కామెడీ స్టూడియో ఒక వేదిక మాత్రమే. నేను చేసిన కామెడీకి ఆ వేదికను కూల్చడం సరికాదు. ఆ వేదికను నియంత్రించే అధికారం ఏ రాజకీయ పార్టీకి కూడా లేదు. ఇది అర్థం లేని చర్య. ఒక ప్రజానాయకుడిపై నేను వేసిన జోక్‌ను తీసుకోలేని మీ అసమర్థత నా హక్కును, స్వభావాన్ని మార్చదు. నాకు తెలిసినంతవరకు మన నాయకులను, సర్కస్ లాంటి రాజకీయ వ్యవస్థను అపహాస్యం చేయడం చట్ట వ్యతిరేకం కాదు. డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ఒకప్పుడు శిండే గురించి చెప్పినవే ఇప్పుడు నేను మాట్లాడాను. నేను ఎవరికీ భయపడను. ఎవరికీ క్షమాపణ చెప్పను' అని కునాల్ పేర్కొన్నారు. తనకు గుణపాఠం చెబుతానని రాజకీయ నేతల నుంచి బెదిరింపులు వస్తున్నాయని పేర్కొంటూ.. వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ కేవలం ధనవంతులు, శక్తివంతులమైన వారికి మాత్రమే కాదని తెలిపారు. తనపై చట్టబద్ధంగా ఎలాంటి చర్యలు తీసుకున్నా పోలీసులకు, కోర్టులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. తాను చేసిన కామెడీకి విధ్వంసమే తగిన సమాధానం అని నిర్ణయించుకొని వేదికను కూల్చిన వారికి కూడా చట్టం, న్యాయం సమానంగా వర్తిస్తాయా..? అని కునాల్ ఈసందర్భంగా కునాల్ ప్రశ్నించారు.

## జమిలి ఎన్నికలు.. జేపీసీ గడువు పొడిగింపు

**ఢిల్లీ,మార్చి 25 :** జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనానికి ఏర్పాటైన జేపీసీ కాల పరిమితి పెంపునకు లోకసభ ఆమోదం తెలిపింది. జమిలి ఎన్నికల కోసం లోకసభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ కాల పరిమితిని పెంచేందుకు లోకసభ అంగీకరించింది. బీజేపీ ఎంపీ పీపీ చౌదరి ప్రతిపాదించిన తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. వర్షాకాల సమావేశాల చివరివారంలో తొలి రోజు వరకు గడువు పొడిగించింది. దేశవ్యాప్తంగా లోకసభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో 39 మంది ఎంపీలతో జేపీసీ కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేసేందుకు ఏర్పాటైంది.



దీనిలో లోకసభ నుంచి 27, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు. అయితే.. ఈ కమిటీ కాలపరిమితి వచ్చేనెల 4న ముగియనుంది. ఈ బిల్లుపై చేయాల్సిన పని ఇంకా మిగిలివుందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ అంశంపై పలువురు న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిగాయి. ఇప్పటికే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్, ప్రఖ్యాత న్యాయకోవిదుడు హరీశ్ సాల్వే, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.పి.షాలు కమిటీ ముందు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేశారు. జేపీసీ గడువు పొడిగించే తీర్మానానికి లోకసభ తాజాగా ఆమోదం తెలిపింది.

# భగత్ సింగ్ ఆశయ సాధన కోసం పోరాడుదాం

- భగత్ సింగ్ జీవిత చరిత్ర పై సదస్సు
- భగత్ సింగ్ 94వ వర్ధంతి సభ
- పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్




కర్నూలు మార్చి 25మనం న్యూస్ః భగత్ సింగ్, రాజుగుర్, సుఖదేవుల స్ఫూర్తితో శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ డీ ఎస్ యూ) రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్ పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలో భగత్ సింగ్ జీవిత చరిత్రపై సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు జిల్లా ఉపాధ్యక్షుడు రమణ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా విచ్చేసిన ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల చరిత్ర నేడు పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని అన్నారు. ఆయన చరిత్రను నేడు యువత ఆదర్శం తీసుకోవాలని అన్నారు. భారత విప్లవానికి పునాది వేశారు. నవ యువకుడు, ఊరుకోలేత్తే ఉత్తేజుడు ఢిల్లీ పూర్వ వీధుల్లో ఎర్ర కాగితాలను వెదజల్లి, బ్రిటిష్ పార్లమెంటులో పొగ బాంబులు విసిరిన ధైర్యశాలని కొనియాడారు. సమ సమాజ స్థాపకుడు షాహిద్ భగత్ సింగ్ సరిగ్గా ఇదే రోజు 1931 రాత్రి 7 గంటలకు బ్రిటిష్ ప్రభుత్వం ముగ్గురు విప్లవ వీరులను ఉరితీసిందని అన్నారు. భారతదేశంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కుల, మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా జాతీయోద్యమ వీరులైన షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత పోరాడి, కుల మతోన్మాద నుండి దేశాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. నాడు భారతదేశాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఈస్ట్ ఇండియా కంపెనీ పేరిట దోచుకుంటే ,నేడు భారత పాలకులైన బిజెపి ప్రభుత్వ సహకారంతో ఆదాని, అంబానీ ,టాటా ,బిర్లా లాంటి అనేక బహుళ జాతి కంపెనీలు దేశ ఆర్థిక వ్యవస్థను దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 సంవత్సరాల మోడీ పాలనలో భారత రాజ్యాంగ లక్ష్యాలు, పౌరుల ప్రజాస్వామిక హక్కులు,ప్రభుత్వ రంగ సంస్థలు, దేశ లౌకిక వ్యవస్థ పెను ప్రమాదంలో పడ్డాయనీ ఆవేదన వ్యక్తం చేశారు. భావి భారత పౌరులైన విద్యార్థుల మెదళ్లలో కుల,మత విష బీజాలు నాటేందుకు, విద్యారంగాన్ని పూర్తిగా కాసాయికరణ చేయడానికి నూతన జాతీయ విద్యా విధానం 2020 తీసుకువచ్చారని అన్నారు. దేశంలోని విద్యార్థి, యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో, విశ్వవిద్యాలయాల్లో నాణ్యత ప్రమాణాలు పెంపొందించి, పరిశోధనలకు కావలసిన మౌలిక వసతులు కల్పించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. భారత విద్యార్థి నిరుద్యోగులపై ట్రంప్ దురహంకారానికి వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. యూజీసీ ముసాయిధను రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలను తొత్తులుగా మారిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఈ సందర్భంగా అన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీ డీ ఎస్ యూ నగర అధ్యక్షుడు దామోదర్, నాయకులు స్వరూప్, సాయి, రమేష్ విజయ్, కృష్ణ, మురళి, మోహన్, బాబు, విష్ణు, మనోజ్, వరుణ్ మొదలైన వారు పాల్గొన్నారు.

# 2014 బాయిలర్ బిల్లు పై పార్లమెంటులో మాట్లాడిన ఎం.పి నాగరాజు



కర్నూలు మార్చి 25మనం న్యూస్ః 1923 బాయిలర్ బిల్లును రద్దు చేస్తూ దాని స్థానంలో 2024 బాయిలర్ బిల్లు ను కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టింది.. ఈ సందర్భంగా బిల్లు పై జరిగిన చర్చలో కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు మాట్లాడారు... 2024 బాయిలర్ బిల్లు ప్రజల యొక్క భద్రత మరియు విలువైన వనరులను బాయిలర్స్ పేలుళ్ల ద్వారా సంభవించే విపత్తులను రక్షించడం కోసం నిర్దేశించబడిందన్నారు.. ఈ బిల్లు ద్వారా సులభతర వ్యాపారాన్ని పెంచే అవకాశం ఉందన్నారు... వీలుగా ఈ బిల్లు బాయిలర్లను ఉపయోగించే వారికి , ఎం.ఎస్.ఎం.ఈ తో సహా అందరికి ప్రయోజనం కలుగుతుందన్నారు...బాయిలర్ల భద్రత, బాయిలర్లను పని చేయించే వారి భద్రత ను దృష్టిలో ఉంచుకొని ప్రాణ , ఆస్తి నష్టం కలిగించే ఏడు నేరాలలో మూడు నేరాలను నేర రహితం చేయడం ద్వారా సూక్ష్మ, చిన్న , మధ్య తరహా సంస్థలను ఎం.ఎస్.ఎం.ఈ నిర్వహణ భారం తగ్గిస్తుందన్నారు... కోర్టులు విధించే జరిమాన స్థానంలో కార్య నిర్వహణ జరిమానాలను ప్రవేశ పెట్టడం ద్వారా నియంత్రణ ప్రక్రియ వేగవంతం గా పెరిగి సమర్థవంతంగా ముందుకు సాగుతుందన్నారు... ఈ బిల్లు ద్వారా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలు, కేంద్ర బాయిలర్స్ బోర్డుల విధులు, అధికారాలను ఎలాంటి గందరగోళానికి తావులేకుండా పొందుపరిచారన్నారు.. ప్రధాని నరేంద్ర మోదీ దేశ పారిశ్రామిక రంగం భద్రతకు తీసుకొచ్చిన 2024 బాయిలర్ బిల్లుకు తాము సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నట్లు ఎం.పి నాగరాజు తెలిపారు.

# మల్లన్న సన్నిధిలో కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్



శ్రీశైలం మార్చి 25 మార్చిమనం న్యూస్ః శ్రీశైల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను కర్ణాటక రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ దర్శించుకున్నారు. మంగళవారం ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న వారికి ఈవో శ్రీనివాస రావు పూలమాలతో స్వాగతం పలకగా అర్చక వేద పండితులు తిలకధారణ చేశారు. అనంతరం గవర్నర్ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనాల అనంతరం అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో వేద పండితుల నిర్వచనం చేయించి శ్రీ స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని లడ్డు ప్రసాదాలు శేష వస్త్రాన్ని అందించారు.

# పన్ను బకాయిదారులకు కమిషనర్ లేఖ

- పన్ను బకాయిలపై 50% శాతం మాఫీ సద్వినియోగపరచుకోండి
- సచివాలయ సిబ్బందితో వాట్సాప్ ద్వారా చేరవేత
- ప్రయోజనాలు పొందుతూ ఇంకా జాప్యాన్ని అంగీకరించలేం
- చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు సమయం ఆసన్నమైంది



కర్నూలు, మార్చి 25మనం న్యూస్ః నగరంలో ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ రుసుములను రాబట్టేందుకు వినూత్న కార్యక్రమాలతో ముందుకెళ్తున్న కర్నూలు నగరపాలక సంస్థ మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన చేసిన జీవో 46 ఉత్తర్వుల మేరకు ఆస్తి పన్ను బకాయిలపై 50% వడ్డీ మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వినూత్నంగా బకాయిదారులకు సచివాలయ సిబ్బందితో వాట్సాప్ ద్వారా లేఖ పంపారు. కొన్నేళ్లుగా బకాయిలు చెల్లించాలని వివిధ రూపాల్లో కోరుతున్నప్పటికీ, కొంతమంది బకాయిదారులు మొండిగా వివరించడం అంగీకరించలేమని కమిషనర్ లేఖలో పేర్కొన్నారు. చెత్త సేకరణ, వ్యర్థాల తొలగింపు, పూడికతీత పనులు, రహదారుల పరిశుభ్రత, శునకాల బెడద నియంత్రణ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రహదారుల నిర్వహణ, ఉద్యానవనాల నిర్వహణ, మురుగు కాలువల నిర్మాణాల అవసరం పౌరులకు ఎంతుందో, వీటి కోసం నిధులు సమకూర్చుకోవడం కూడా అంతే అవసరమని స్పష్టం చేశారు. మొండి బకాయిదారులపై తమకున్న విచక్షణ అధికారము ఉపయోగించి చట్ట ప్రకారంగా మరింత కఠిన చర్యలు తీసుకునేందుకు సమయం ఆసన్నమైందన్నారు. తాగునీటి సరఫరా నిలిపివేయడం, షాపులు సీజ్ చేయడం వంటివి తప్పదని హెచ్చరించారు. ప్రయోజనాలు పొందుతూ పన్నులు చెల్లింపునకు జాప్యం చేయడం తగదని, సత్వరమే తమ పన్నులను చెల్లించాలని కమిషనర్ బకాయిదారులకు హితవు పలికారు.

# శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలకు సర్వం సిద్ధం



శ్రీశైలం మార్చి 25మనం న్యూస్ః శ్రీశైలంలో వైభవోపేతంగా జరిగే ఉగాది మహోత్సవాలకు వచ్చే యాత్రికులకు తగిన ఏర్పాట్లు పూర్తి చేసుకుని సర్వం సిద్ధం చేసినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 27వతేదీ నుండి 31వ తేదీ వరకు జరిగే మహోత్సవాలకు కర్నాటక మహారాష్ట్ర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులుస్వామిఅమ్మవార్లను దర్శించుకుంటారని ఆయన తెలిపారు. ఇప్పటికే దూర ప్రాంతాల నుండి పాదయాత్రలు చేస్తూ వచ్చే భక్తుల రద్దీ ఎక్కువవుతుంది. మహోత్సవాలలో భాగంగా స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు, వాహన సేవలు, 29న ప్రభోత్సవం, వీరచార విన్యాసాలు, 30న ఉగాది పర్వదిన ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం, రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయని ఈవో పేర్కొన్నారు. అదే విధంగా పాదయాత్ర చేస్తూ వస్తున్న యాత్రికులతోపాటు క్యూ కాంప్లెక్సులో వేచి ఉండే భక్తులకు సేవ చేసేందుకు వస్తున్న ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలశివసేవకులతోపాటు కన్నడీగుల స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో అన్నదాన శిబిరాలు ఏర్పాటు చేయగా మంచినీరు, మజ్జిగ, పండ్ల వితరణతోపాటు పారిశుధ్యం, వైద్య శిబిరాలను దేవస్థానం పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## రేపు హుండీ లెక్కింపు

మహానంది, మార్చి25,మనంన్యూస్ః శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను 27 న లెక్కింపు చేస్తున్నట్లు ఈఓ శ్రీనివాస రెడ్డి మంగళవారం తెలిపారు. ఉగాది పర్వదినం సమీపిస్తుండటంతో హుండీ లెక్కింపు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు, సేవాబందాలు పాల్గొనవచ్చునని తెలిపారు.

# అంగన్వాడీలకు శిక్షణా కార్యక్రమం




మహానంది,మార్చి25,మనంన్యూస్ః మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్, ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత జ్యోతి ప్రజ్వలన చేసికార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత మాట్లాడుతూ ఈనెల 25 నుంచి 27వరకు మూడు రోజులపాటు అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, అంగన్వాడి కేంద్రంలోని పిల్లలకు విద్య, ఆరోగ్యం ప్రాముఖ్యత, అభివృద్ధికి తగిన బోధనా పద్ధతులు, అంగన్వాడీ కేంద్రాల్లో చేయాల్సిన కార్యక్రమాలపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అప్పుడే పుట్టిన పిల్లలను మూడు సంవత్సరాల పిల్లలకు, నవచేతన కార్యక్రమం ద్వారా, తల్లులకు వారి పోషణ గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు, ఆదార్ శీలా కార్యక్రమం ద్వారా, వారి సమగ్రత అభివృద్ధి కోసం, ఆట పాటలతో కూడిన విద్య, పోషణ బాల్యారంభ సంరక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక గవర్నర్ పర్యటన సందర్భంగా భద్రత ఏర్పాట్ల పరిశీలన

శ్రీశైలం మార్చి 25 మనం న్యూస్ః శ్రీశైలం మహా క్షేత్రానికి కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ మంగళవారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శించుకోవడానికి పర్యటించనున్న ప్రదేశాలను జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా స్వయంగా సందర్శించి భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం అక్కడ విధులలో ఉన్న సిబ్బందికి స్పెషల్ పార్టీ పోలీసు బృందాలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా తగు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ చంద్రబాబు శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు తదితరులున్నారు.



# ఎమ్మెల్సీ బి.టి నాయుడుని కలిసిన టిడిపి నాయకులు



కౌతాళం, మర్చి 25 మనం న్యూస్ః గత కొద్ది రోజులుగా కూటమి ప్రభుత్వం మరోసారి ఎమ్మెల్సీగా మన అందరి అభిమాన నాయకులు బి.టి నాయుడుకి అవకాశం కల్పించిన సందర్భంగా మంగళవారం రోజున ఆదోని నందు ఆయన స్వగృహంలో కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.వాల్మీకి బోయలకు రెండోసారి ఈ అవకాశం కల్పించిన సీఎం నారా చంద్రబాబనాయుడుకి యువ నాయకులు నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రజలకు సేవ చేసే భాగ్యం మా వాల్మీకి కులానికి ఇవ్వడం శుభపరిమణంగా తీసుకొని ఇటు మంత్రాలయం ప్రజలను,రాష్ట్ర ప్రజలను సంక్షేమం,అభివృద్ధి మరియు చైతన్యం



పరిచేలా చూడాలని మరియు వాల్మీకి కూల ఆశయం ఎస్టీ సాధన కు కృషి చేసి మా కూల ఆరాధ్యుడిగా నిలబడాలని కోరడం జరిగినది.ఈ కార్యక్రమములో హాల్వి సిద్దప్ప,తెదేపా సర్పంచ్ లక్కే గోవిందు,కురువ నాగేష్, ముత్తన్న,నాగరాజు,యాంకన్న,ప్రకాష్ మొదలగు వారు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## మద్దిలేటి స్వామి సన్నిధి లో హుండీ లెక్కింపు



- 396606 ఆదాయం

బేతంచేర్ల, మార్చి 25(మనంన్యూస్)ః మండలపరిధిలో ఆర్ఎస్ రంగాపురం గ్రామం సమీపంలో ఎర్రమల కొండలలో స్వయంభుగా వెలిసిన శ్రీ ప్రముఖ వైష్ణవి పుణ్యక్షేత్రం లో శ్రీ ఘన మద్దిలేటి నరసింహస్వామి లక్ష్మీ అమ్మవారి 58 రోజులకు సంబంధించిన లెక్కింపు దేవాదాయ శాఖ అధికారి వి జనార్ధన్ ఉప కమిషనర్ రామాంజనేయులు హుండీ లెక్కింపు నిర్వహించారు స్వామి వారి హుండీ ద్వారా 34 38 985 47 గ్రాముల బంగారు 1కేజీ 300 గ్రాముల వెండి శ్రీలక్ష్మి అమ్మవారు హుండీ లెక్కింపు ద్వారా 527081 ఆదాయం రెండు హుండీల ద్వారా 396606 ఆదాయం చేకూరినట్లు ఆలయం ఉప కమిషనర్ కార్యనిర్వాహక అధికారి రామాంజనేయులు తెలిపారు హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్ ఆశయాలు కొనసాగిస్తాం

- వారి స్ఫూర్తితో పోరాటాలు కొనసాగిద్దాం
- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్



కర్నూలు మార్చి 25మనం న్యూస్ః స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవ యువ కిశోరాలు భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్ కొనసాగిస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. శరత్ కుమార్ అన్నారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీ నందు భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్ 94 వ వర్ధంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి ఆర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్.నరసింహులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శరత్ కుమార్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో నాటి బ్రిటిష్ పరాయి పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన వారి పోరాటం ఎనలేనిది అన్నారు. భారతీయులకు సంపూర్ణ స్వేచ్ఛావాయులు కావాలని, దేశవ్యాప్తంగా నిరసనలు వెలువెత్తుతున్న బ్రిటిష్ అధికారులు స్పందించడం లేదని తలచి, నాడు బ్రిటిష్ వాళ్ళు జరిపిన జలియన్ వాలా బాగ్ దురాగతాన్ని రోజు తలుచుకుంటూ భారతీయుల రక్తంతో తడిచిన మట్టిని తీసుకెళ్లి, రోజు స్మరించుకుంటూ, బ్రిటిషర్ల భారతం పట్టాలని భగత్ సింగ్ వారి సహచర బృందం బ్రిటిష్ పార్లమెంటు భవనంపై బాంబుల దాడులు కురిపించి, బ్రిటిషర్ల చెవులకు పట్టిన చిల్లులను వదిలించారని అన్నారు. అనంతరం ఆయనను ఖైదీగా బంధించి, ఉరితీసారని, ఉరి తీసే సమయంలో కూడా భారతదేశాన్ని స్మరిస్తూ ఉరితాడును వర్ణమాలగా స్వీకరించి, ఉరికంబాన్ని ముద్దాడి, 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే నినాదాలు ఇచ్చి, భారతదేశ యువతను ఉగ్రూతలుగించిన గొప్ప పోరాట యోధులు భగత్ సింగ్ రాజ్ గురు, సుఖ్ దేవ్ లని కొనియాడారు. నేడు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం భగత్ సింగ్ మరియు స్వాతంత్ర సమరయోధుల చరిత్రలను వక్రీకరిస్తుందని మండిపడ్డారు. దేశ స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొన్న వారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ, బ్రిటీష్ పరాయి పాలకులకు తొత్తులుగా వ్యవహరించిన వారిని దేశభక్తులుగా పేర్కొంటున్నారని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భగత్ సింగ్,రాజ్ గురు, సుఖ్ దేవ్ లను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ నాయకులు సురేష్, ఈశ్వర్, విద్యార్థినీ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న మంత్రి టి.జి భరత్

కర్నూలు మార్చి 25మనం న్యూస్ః అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెండు రోజుల పాటు జరుగనున్న మూడవ జిల్లా కలెక్టర్ల సమావేశాల్లో భాగంగా మొదటి రోజు సమావేశంలో.. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ పాల్గొన్నారు.





# ఎ- గ్రేడ్‌లోనే హర్మన్, స్మృతి, దీప్తి



భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, ఆల్ రౌండర్ దీప్తిశర్మలు బీసీసీఐ కేంద్ర కాంట్రాక్టులో ఎ- గ్రేడ్ ను నిలబెట్టుకున్నారు. సోమవారం ప్రకటించిన జాబితాలో బీసీసీఐ ఈ ముగ్గురిని ఎ- గ్రేడ్ లో కొనసాగించింది. రేణుక ఠాకూర్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, షెఫాలీవర్మలు బి- గ్రేడ్ లో తమ స్థానాన్ని కాపాడుకున్నారు. యాస్తిక భాటియా, రాధ యాదవ్, శ్రేయాంక పాటిల్, టిటాస్ సాధు, అరుంధతిరెడ్డి, అమన్ జ్యోత్, ఉమ ఛెత్రి, స్నేహ్ రాణా, పూజ వస్త్రాకర్ లకు సి- గ్రేడ్లో చోటు దక్కింది. ఎ- గ్రేడ్ క్రికెటర్లకు ఏడాదికి రూ.50 లక్షలు బీసీసీఐ చెల్లించనుంది. బి- గ్రేడ్ కు రూ.30 లక్షలు, సి- గ్రేడ్ కు రూ.10 లక్షలు లభిస్తాయి.

# పోరాడి ఓడిన గుజరాత్.. బోణీ కొట్టిన పంజాబ్



ఐపీఎల్ 18వ సీజన్ లో భాగంగా పంజాబ్ కింగ్స్ బోణీ కొట్టింది. సొంత మైదానంలో గుజరాత్ జట్టు పోరాడి ఓడింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో పంజాబ్ 11 పరుగుల తేడాతో గెలుపొందింది. 245 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. ఆ జట్టులో సాయి సుదర్శన్ (74: 41 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సులు), శుభ్మన్ గిల్ (33: 14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు), జోస్ బట్లర్ (54: 33 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు), రుథర్ఫర్డ్ (46: 27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) దూకుడుగా ఆడినప్పటికి భారీ లక్ష్యం కావడంతో ఓటమి చవిచూసింది. పంజాబ్ బౌలర్లలో అర్ష్దీప్ సింగ్ 2, మాక్స్వెల్ ఒక్కో వికెట్ తీశారు.

# IPL-2025





చెన్నై సూపర్ కింగ్స్ మాజీ సారథి ఎంఎస్ ధోనీ ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ ని సమర్థించాడు. అయితే, ఈ రూల్ వచ్చిన కొత్తలో తనకు అస్సలు నచ్చలేదని, ఇది అవసరం లేదని అనిపించిందని పేర్కొన్నాడు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ ని ఐపీఎల్ 2023 సీజన్ లో ప్రవేశపెట్టారు. ఈ నియమం వల్ల అదనంగా ఒక బ్యాటర్ లేదా బౌలర్ ను తీసుకుంటూ జట్లు ప్రయోజనం పొందుతున్నాయి. ముఖ్యంగా ఎక్స్ ట్రా బ్యాటర్ ను బరిలోకి దింపి టీమ్ భారీ స్కోరు సాధించేలా చేస్తున్నాయి. గత సీజన్ లో 41 సార్లు 200కుపైచిలుకు స్కోర్లు నమోదయ్యాయి. కానీ, ఇంపాక్ట్ ప్లేయర్ వల్ల భారీ స్కోర్లు నమోదు కావడం లేదని, ఆటగాళ్ల మైండ్ సెట్ మారడంతోనే ఇది సాధ్యమవుతోందని ధోనీ పేర్కొన్నాడు.

## ఆ ధైర్యంతోనే ఆటగాళ్లు భయం లేకుండా ఆడుతున్నారు

'ఈ రూల్ ను అమలు చేసిన కొత్తలో నాకైతే ఇది అనవసరమనిపించింది. ఒక విధంగా ఈ రూల్ నాకు హెల్ప్ అవుతుంది. కానీ, నాకు దీని అవసరం లేదు. నేను ఇప్పటికీ వికెట్ కీపింగ్ చేస్తాను. కాబట్టి నేను ఇంపాక్ట్ ప్లేయర్ని కాదు. ఆటలో పాలుపంచుకోవడం నాకు ఇష్టం. ఈ రూల్ వల్ల మ్యాచ్ ల్లో మరిన్ని భారీ స్కోర్లు నమోదవుతాయని చాలామంది అంటున్నారు. నేనైతే పిచ్ పరిస్థితులు,ప్లేయర్ల కాన్ఫిడెన్స్ లెవల్స్ కూడా భారీ స్కోర్లకు కారణమని నమ్ముతున్నా. అదనపు బ్యాటర్ ఉన్నాడనే ధైర్యంతో ఆటగాళ్లు భయం లేకుండా మరింత దూకుడుగా ఆడుతున్నారు. అలా అని టీమ్స్ నలుగురైదుగురు ఎక్స్ ట్రా బ్యాటర్లను ఆడించట్లేదు. కానీ, ఆ అదనపు బ్యాటర్ ఉన్నాడనే భరోసాతో మాత్రం ముందుగా వచ్చే బ్యాటింగ్ చేసే ప్లేయర్ల ఆటతీరును మార్చేస్తోంది. టీ20 క్రికెట్ ఇలాగే మారిపోయింది' అని ధోనీ వివరించాడు.

ప్రస్తుతం ఐపీఎల్ 2025లో ధోనీ సీఎస్కేకు ఆడుతున్న సంగతి తెలిసిందే. 43 ఏళ్ల వయసులోనూ వికెట్ కీపర్ గా అదరగొడుతున్నాడు. ముంబయి ఇండియన్స్ తో జరిగిన మ్యాచ్ లో సూర్యకుమార్ యాదవ్ ను మెరుపు స్టంపింగ్ తో పెవిలియన్ కు పంపాడు. ఛేదనలో విన్నింగ్ షాట్ కొట్టే అవకాశం వచ్చినా రెండు డాట్ బాల్స్ ఆడి రచిన్ రవీంద్రకు మ్యాచ్ ముగించే బాధ్యత అప్పగించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ తదుపరి మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ఈ మ్యాచ్ మార్చి 27న చెన్నై వేదికగా జరగనుంది.



బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టులకు సంబంధించిన జాబితా విడుదల కావాల్సిఉంది. ఈనేపథ్యంలో క్రీడా పండితులు పలు ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం కాంట్రాక్టు కోల్పోయిన శ్రేయస్ అయ్యర్... ఈసారి కచ్చితంగా దక్కించుకునే అవకాశాలే కనిపిస్తున్నాయి. టీ20 వరల్ కప్ అనంతరం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా పొట్టి ఫార్మాట్ కు వీడ్కోలు పలికారు. ఈ

## శ్రేయస్‌కు బీసీసీఐ కాంట్రాక్టు ఖాయం!

నేపథ్యంలో వారికి ఈసారి A+ కేటగిరిలో స్థానం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఈ విభాగంలో కొనసాగాలంటే ఆటగాళ్లు టెస్టులు, వన్డేలు, టీ20లు ఇలా ఈ మూడు ఫార్మాట్లలోనూ ఆడాలి. దీంతో ఈ ముగ్గురు A కేటగిరి కింద బీసీసీఐ కాంట్రాక్టులు పొందనున్నారు. జస్ప్రీత్ బుమ్రా మాత్రం గత ఏడాదిలానే ఈ ఏడాది కూడా A+ కేటగిరిని సొంతం చేసుకోనున్నాడు. నిరుడు A కేటగిరిలో ఉన్న రవిచంద్రన్ అశ్విన్ ఈసారి కాంట్రాక్టు జాబితా నుంచి నిష్క్రమిస్తాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు అతడు రిటైర్మెంట్ ప్రకటించడమే దీనికి కారణం. ఇంగ్లాండ్ తో టీ 20 సిరీస్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన అక్షర్పటేల్ ఈసారి కేటగిరి B నుంచి Aకు వచ్చే అవకాశం ఉంది. గత సంవత్సరం బీసీసీఐ ఆగ్రహానికి గురై, అనూహ్య పరిస్థితుల్లో శ్రేయస్ అయ్యర్ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయాడు. ఇటీవల జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో తన సమయోచిత బ్యాటింగ్‌తో టీమ్ఇండియా విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. దీంతో శ్రేయస్ తిరిగి కాంట్రాక్ట్‌ను పొందడం ఖాయంగా కనిపిస్తోంది. యశస్వి జైశ్వాల్ కూడా కేటగిరి B నుంచి ప్రమోషన్ పొందే అవకాశాలున్నాయి. ఆకాశ్దీప్, సర్ఫరాజ్ ఖాన్ కేటగిరి Cలో స్థానం దక్కించుకోవచ్చు. నితీశ్కుమార్ రెడ్డి పేరు కూడా సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో కనిపించొచ్చు. శార్దూల్ ఠాకూర్, రుతురాజ్ గైక్వాడ్ కాంట్రాక్టులో కొనసాగడం సందేహంగానే ఉంది. ఏదేమైనప్పటికీ సెలక్షన్ కమిటీ, ప్రధాన కోచ్‌తో సంప్రదింపుల తర్వాత బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా తుది జాబితాను అపెక్స్ కౌన్సిల్ ముందు ఆమోదం కోసం పెట్టనున్నాడు. అప్పుడే అధికారికంగా పూర్తి సమాచారం తెలియనుంది.

# దర్శకుడితో నయనతార గొడవ..

స్టార్ హీరోయిన్ నయనతార ఈ మధ్య ఎక్కువ విమర్శలకు గురవుతుంది. రీసెంట్ గానే ఆమెపై నెటిజన్లు మండిపడ్డారు. మూకుత్తి అమ్మన్ 2 సినిమా పూజా కార్యక్రమాల్లో తోటి నటి మీనాను అవమానపరిచారు అంటూ ఆమెను ట్రోల్ చేశారు. తాజాగా నయనతారపై మరో పుకారు నెట్టింట హల్ చల్ చేస్తోంది. మూకుత్తి అమ్మన్ 2 సినిమా సెట్ లో అసిస్టెంట్ డైరెక్టర్ తో నయనతార గొడవపడిందట. ఇదే విషయంపై దర్శకుడు సుందర్.సీ, నయనతారల మధ్య విభేధాలు రావడంతో షూటింగ్ నిలిపివేసిట్లు తెలుస్తోంది. నయనతార హీరోయిన్ గా సుందర్ సి దర్శకత్వంలో 'మూకుతి అమ్మన్ 2' చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇటీవల ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. తాజాగా కాస్ట్యూమ్ విషయంలో నయనతార , ఒక అసిస్టెంట్ డైరెక్టర్ మధ్య చిన్నపాటి వివాదం జరిగినట్లు సమాచారం. ఈ సంఘటన నయనతారకు నచ్చకపోవడంతో ఆమె ఆ అసిస్టెంట్ డైరెక్టర్ ను తీవ్రంగా మందలించినట్లు తెలుస్తోంది. ఈ చిన్న విషయం కాస్త పెద్ద వివాదంగా మారడంతో దర్శకుడు సుందర్ సి షూటింగ్ కు తాత్కాలిక విరామం ప్రకటించినట్లు వినికిడి. నయనతార ప్రవర్తన సుందర్ సికి సంతృప్తి కలిగించకపోవడంతో, ఆమెను సినిమా నుంచి తొలగించి, మరో సీనియర్ నటిని తీసుకొని చిత్రాన్ని కొనసాగించాలనే ఆలోచన చేశాడట.

అయితే నిర్మాత ఇషారి కె. గణేష్ జోక్యం చేసుకుని నయనతారతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించారట. ప్రస్తుతం చెన్నైలోని ఓ దేవాలయంలో ఈ సినిమా షూటింగ్ జరుగుతుంది.



# నా ఆదాయ మార్గం సినిమానే.. : పవన్ కల్యాణ్


ఒకవైపు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేస్తూనే మరోవైపు అంగీకరించిన సినిమాల్లోను నటిస్తున్నారు పవన్ కల్యాణ్. అయితే, ఆయన సినీరంగంలో కొనసాగుతారా? వరుస సినిమాలు చేస్తారా? అని అభిమానులు కొన్ని రోజులుగా ఆందోళన చెందుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై పవన్ క్లారిటీ ఇచ్చారు. ఓ తమిళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన సినిమాల గురించి మాట్లాడారు.



డబ్బు అవసరం ఉన్నంతవరకూ నటిస్తూనే ఉంటానన్నారు. ''నేను ఎంతోమంది యోగులు, సిద్ధులను చూసి స్ఫూర్తి పొందుతుంటాను. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడం కోసం రాజకీయాల్లోకి వచ్చాను. ఎప్పుడూ ఇదే ఆలోచనలో ఉంటాను. నేను సంపద కూడబెట్టుకోలేదు. సినిమా నిర్మాణరంగంలోనూ భాగం కాను. ఎలాంటి వ్యాపారాలు లేవు. నాకు ఉన్న ఆదాయమార్గం నటనే. నేను సినిమాలు చేస్తున్నంతవరకూ వాటికి న్యాయం చేయాలి. అలాగే నాకు డబ్బు అవసరం ఉన్నంతవరకూ నటిస్తూనే ఉంటాను. అయితే, పరిపాలనకు ఎలాంటి ఆటంకం కలగకుండా నటిస్తాను'' అని పవన్ క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ మూడు సినిమాలతో బిజీగా ఉన్నారు. క్రిష్ జాగర్ల మూడి, జ్యోతికృష్ణల దర్శకత్వంలో హరిహర వీరమల్లులో నటిస్తున్నారు. ఇటీవలే దీని డబ్బింగ్ పనులు ప్రారంభమయ్యాయి. 17వ శతాబ్దం నేపథ్యంలో సాగే ఈ కథలో పవన్ కల్యాణ్ చరిత్రాత్మక యోధుడిగా కనువిందు చేయనున్నారు. దీనితో పాటు సుజీత్ దర్శకత్వంలో 'ఓజీ', హరీశ్ శంకర్ దర్శకత్వంలో 'ఉస్తాద్ భగత్ సింగ్'లోనూ పవన్ నటిస్తున్నారు.



## పవన్ కల్యాణ్ గురువు షిహాన్ హుసైని కన్నుమూత



ప్రముఖ కోలీవుడ్ నటుడు షిహాన్ హుసైని (60) కన్నుమూశారు. బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబసభ్యులు సామాజిక మాధ్యమాల వేదికగా ధ్రువీకరించారు. హుసైని మృతిపై పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. కాగా.. ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణ్ కు హుసైని మార్షల్ ఆర్ట్స్, కరాటే, కిక్ బాక్సింగ్ లో శిక్షణ ఇచ్చారు. షిహాన్ హుసైని 1986లో విడుదలైన 'పున్నగై మన్నన్' చిత్రం ద్వారా తమిళ చిత్రసీమకు పరిచయమయ్యారు. పలు చిత్రాల్లో నటించిన ఆయనకు విజయ్ హీరోగా నటించిన 'బద్రి' సినిమా గుర్తింపునిచ్చింది.

## మరో డ్రాగన్ వచ్చేస్తున్నాడు..

ప్రస్తుతం మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా పలు భారీ సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రాల్లో దర్శకుడు ప్రశాంత్ నీల్ తో చేస్తున్న సినిమా కూడా ఒకటి. ప్రస్తుతానికి ఈ సినిమాకి డ్రాగన్ అనే టైటిల్ పరిగణలో ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. మరి ఈ సినిమాని నిర్మాణం వహిస్తున్న నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ మరో డ్రాగన్ హీరోతో సినిమా చేస్తున్నారు. రీసెంట్ గా కోలీవుడ్ సహా తెలుగులో కూడా డ్రాగన్ అనే సినిమాతో భారీ హిట్ అందుకున్న యువ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా మైత్రి మూవీ మేకర్స్ కలయికలో చేస్తున్న చిత్రంపై ఇపుడు సాలిడ్ అప్డేట్ వచ్చింది. ప్రదీప్ కెరీర్లో నాలుగవ సినిమాగా మైత్రి సంస్థ తెరకెక్కిస్తున్న ఈ సినిమాని ఫస్ట్ షాట్ భూమ్ గా రేపు మార్చ్ 26న రిలీజ్ చేస్తున్నట్టుగా ఉదయం 11 గంటల 7 నిమిషాల సమయాన్ని లాక్ చేశారు. ఇక ఈ చిత్రాన్ని కీర్తిశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా మమిత బైజు హీరోయిన్ గా నటిస్తుంది. అలాగే సెన్సేషనల్ సంగీత దర్శకుడు సాయి అభయంకర్ ట్యూన్స్ అందిస్తున్నాడు. మరి ఈ అప్డేట్ ఏంటో చూడాలి.




# త్రివిక్రమ్ భారీ ప్లాన్..

## బన్నీతో ఎవరికీ తెలియని ప్రయత్నం!

ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ స్టార్డం పతాక స్థాయిలో ఉన్న సంగతి తెలిసిందే. ఎలాంటి రాజమౌళి బ్రాండ్ లేకుండా ఇక స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా లెవెల్లో తన క్రేజ్ అండ్ మార్కెట్ ని చూపించి బ్రాండ్ గా నిలిచాడు. అయితే అల్లు అర్జున్ నుంచి నెక్స్ట్ పుష్ప 2 సినిమా తర్వాత పలు భారీ సినిమాలే ఉండగా వాటిలో మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ తో చేయనున్న భారీ చిత్రం కూడా ఒకటి. నిజానికి పుష్ప 2 తర్వాత ఇదే స్టార్ట్ కావాల్సి ఉంది కానీ ఇపుడు దీనిని అట్లీ ప్రాజెక్ట్ రీప్లేస్ చేస్తుంది. అయితే లేటెస్ట్ గా త్రివిక్రమ్ తో సినిమా విషయంలో నిర్మాత నాగవంశీ చేసిన కామెంట్స్ ఇపుడు వైరల్ గా మారాయి. అల్లు అర్జున్ తో తాము ఇండియన్ సినిమా దగ్గర ఎవరూ టచ్ చెయ్యని మైథాలజీ సబ్జెక్టుతో సినిమాని చాలా గ్రాండ్ లెవెల్లో ప్లాన్ చేస్తున్నట్టుగా తాను రివీల్ చేశారు. ఒక్కసారి ఆ సినిమా వచ్చాక యావత్ భారతదేశం ఈ సినిమా వైపు చూస్తుంది అని కన్ఫర్మ్ చేశారు. అలాగే ఇది మహాభారతం లేదా రామాయణంకి సంబంధించిన కథ కాదు అని మన ఇతిహాసాల్లోనే ఎవరికీ తెలియని ఒక కొత్త పాత్రతో తాము చేస్తున్నట్టుగా తెలిపారు. దీనితో ఈ కామెంట్స్ ఇపుడు అభిమానుల్ని మరింత ఎగ్జైట్ చేస్తున్నాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.